# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :292 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది:శనివారం 01-02-2025 | పేజీలు:4 వెల: 2.00


## విశాఖ స్టీల్ ప్లాంట్ పునర్నిర్మిస్తాం

విశాఖపట్నం, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయబోమని, ప్లాంట్‌ను పునర్‌నిర్మిస్తామని కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రతినిధులు, అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులతో వేర్వేరుగా కుమారస్వామి భేటీ అయ్యారు. అనంతరం మరో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీలు భరత్, కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావులతో కలిసి కుమారస్వామి మీడియాతో మాట్లాడారు. 'విశాఖ ఉక్కు పరిశ్రమ సాధనకు సుమారు 30 మంది మరణించారు. పరిశ్రమ ప్రారంభంలో ఉత్పత్తి బాగా ఉండేది. 2013-14 వరకు ఉక్కు పరిశ్రమ పనితీరు బాగానే ఉంది. 2014లో నవరత్న హోదా సాధించింది. ఉక్కు ఉత్పత్తి పెంచాలని నిర్ణయించినప్పటి నుంచి నష్టాల్లోకి వెళ్లింది. విశాఖ ఉక్కు పరిశ్రమ దుస్థితి గురించి ఏపీ ఎంపీలు వివరించారు. కేంద్ర మంత్రి అయ్యాక స్టీల్‌ఎ÷-లాంట్‌పై ఎన్నో సమీక్షలు చేశా. 2021లో విశాఖ ఉక్కు పరిశ్రమలో పెట్టుబడుల ఉపసంహరణకు ప్రతిపాదించారు.

## భారత్‌ను మూడో ఆర్థిక శక్తిగా నిలుపుతాం..



న్యూఢిల్లీ, ప్రపంచంలోనే భారత్‌ను మూడో ఆర్థిక శక్తిగా నిలపనున్నట్లు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు. దేశాభివృద్ధి ఫలాలు అందరికీ అందాలన్నదే తమ ఉద్దేశమని చెప్పారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం సందర్భంగా ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించారు. భారత సామాజిక చేతనకు మహాకుంభమేళా నిదర్శంగా నిలుస్తోందన్నారు. దేశాభివృద్ధి కోసం వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నట్లు చెప్పారు. తమ ప్రభుత్వ మూడో టర్మ్‌లో మూడు రెట్ల వేగంతో అభివృద్ధి సాగుతోందని రాష్ట్రపతి తెలిపారు.'బడ్జెట్-2025లో రైతులు, మహిళలు, పేదలు, యువతకు ప్రాధాన్యం ఇస్తున్నాం. రూ.70 వేల కోట్లతో గ్రామీణ రహదారులను అభివృద్ధి చేస్తున్నాం. 3 కోట్ల మంది పేద కుటుంబాలకు ఇళ్లు నిర్మిస్తున్నాం. దేశాభివృద్ధి ఫలాలు అందరికీ అందాలన్నదే మా లక్ష్యం. పేద, మధ్యతరగతి ప్రజలకు హోమ్ లోన్ సబ్సిడీ ఇస్తున్నాం. ఉద్యోగుల కోసం 8వ వేతన సంఘాన్ని నియమించాం. 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తెచ్చాం. వన్ నేషన్ - వన్ ఎలక్షన్ దిశగా అడుగులు వేస్తున్నాం. ట్యాక్స్ విధానాలను సరళీకరించాం. భారత్ త్వరలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుంది. చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్లతో గొప్ప ముందడుగు వేస్తున్నాం. 70 ఏళ్లు దాటిన 6 కోట్లమందికి ఆరోగ్య బీమా కల్పిస్తున్నాం. యువతకు ఉద్యోగాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాం. దేశంలో లక్షా 15 వేల మంది మహిళలు లక్‌పతీ దీదీలుగా మారారు. మూడు లక్షలమంది మహిళలను లక్‌పతీ దీదీగా మార్చాలన్నదే మా ప్రభుత్వ సంకల్పం' అని రాష్ట్రపతిముర్ము తన ప్రసంగంలో వివరించారు.

### పోలవరం ప్రాజెక్టు పూర్తికి కేంద్రం కృషి : రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

అమరావతి : పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం సందర్భంగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తన ప్రసంగంలో పోలవరం ప్రాజెక్టు గురించి ప్రస్తావించారు. ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం కట్టుబడి ఉందని ఆమె అన్నారు. ఇందుకు గాను కేంద్రం రూ. 12వేల కోట్లను కేటాయించిందని వెల్లడించారు.గత మేలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు కూటమిగాఏర్పడి పోటీ చేసి ఘన విజయం సాధించింది. అప్పటి వైసీపీ ప్రభుత్వాన్ని ఓడించి కూటమి అధికారంలోకి వచ్చింది. ఏపీ నుంచి 21మంది కూటమి సభ్యులు ఎంపీలుగా గెలిచారు. దీంతో దేశంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటులో అతిపెద్ద భాగస్వామ్య పార్టీగా కూటమి ఆవిర్భవించింది.అప్పటి నుంచి రాష్ట్రానికి కేంద్రం కొత్త పథకాల మంజూరు, నిధుల కేటాయింపునకు అధిక ప్రాదాన్యం ఇస్తూ వస్తుంది. ఇందులో భాగంగా ఏపీకి జీవనాడిగా ఉన్న పోలవరం ప్రాజెక్టు పూర్తికి రాష్ట్ర ప్రభుత్వం అడిగిన వెంటనే రూ. 12 వేల కోట్లను మంజూరు చేసింది. ఇటీవల విశాఖ స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణకు మూడు విడతలుగా మరో రూ. 11,440 కోట్లను మంజూరు చేసింది.పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర రాజధాని నిర్మాణానికి కూడా హడ్కో ద్వారా సుమారు రూ. 18వేల కోట్లను రుణంగా ఆయా సంస్థల ద్వారా కేటాయించింది. జాతీయ రహదారుల నిర్మాణం, విశాఖ రైల్వే జోన్, గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులకు భారీ ఎత్తున నిధులను కేటాయించింది.

### కుంభమేళా తొక్కిసలాట బాధితులకు పార్లమెంట్ సంతాపం

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు శుక్రవారం ఉదయం ప్రారంభమయ్యాయి. సమావేశాలు ప్రారంభం కాగానే ఇటీవలే యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాలో జరిగిన తొక్కిసలాట ఘటన మృతులకు సభ సంతాపం తెలిపింది. అంతేకాకుండా మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించారు. ఈనెల 29వ తేదీన మౌని అమావాస్య రోజు తెల్లవారుజామున మహాకుంభమేళాలో తొక్కిసలాట ఘటన చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ దుర్ఘటనలో 30 మంది మరణించినట్లు యూపీ ప్రభుత్వం ప్రకటించింది. అదేవిధంగా 40 మంది వరకూ గాయపడినట్లు వెల్లడించింది. ఇక, భారత మాజీ ప్రధాని, ప్రముఖ ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్ (92) గతేడాది డిసెంబర్ 26న కన్నుమూసిన విషయం తెలిసిందే. తీవ్ర అనారోగ్యంతో ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.

## జీహెచ్‌ఎంసీ కార్యాలయం ముందు బీఆర్‌ఎస్ కార్పొరేటర్ల ఆందోళన..



హైదరాబాద్: మేయర్ తీరుకు నిరసనగా జీహెచ్‌ఎంసీ కార్యాలయం ముందు బీఆర్‌ఎస్ పార్టీ కార్పొరేటర్లు నిరసనకు దిగారు. పాలకమండలి సమావేశం సందర్భంగా మేయర్ గద్వాల విజయలక్ష్మి.. బీఆర్‌ఎస్ కార్పొరేటర్లను సస్పెండ్ చేశారు. అనంతరం సభ నుంచి బలవంతంగా మార్షల్స్‌తో బయటికి పంపించారు. దీంతో ఆందోళనకు దిగిన కార్పొరేటర్లను అరెస్టు చేసిన పోలీసులు.. నగరంలోని వివిధ స్టేషన్లను తలరించారు. అయితే ప్రజా సమస్యలపై చర్చించుకునే అవకాశం కల్పించకపోగా, ఎలాంటి చర్చ లేకుండానే బడ్జెట్‌ను ఆమోదించారు.ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేసే విధంగా వ్యవహరించిన అధికార పార్టీ తీరుకు నిరసనగా జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం ముందు బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు శుక్రవారం నిరసన తెలిపారు. తమపై దాడి చేసిన కాంగ్రెస్ కార్పొరేటర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రజా సమస్యలపై తమ పోరాటం ఆగదని, క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ విధానాలను ఎండగడతామని ఈ సందర్భంగా కార్పొరేటర్లు ముద్దం నరసింహ యాదవ్, ఆవుల రవీందర్ రెడ్డి, మందడి శ్రీనివాసరావు, విజయశాంతి, సతీష్ గౌడ్ స్పష్టం చేశారు.పాలకమండలి వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధుల గొంతునొక్కింది. గురువారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన 10వ సర్వసభ్య సమావేశంలో వారిని సభ ఘోరంగా అవమానించింది. జీహెచ్‌ఎంసీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మెజార్టీ సభ్యులున్న బీఆర్‌ఎస్ కార్పొరేటర్లను మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సస్పెండ్ చేసి.. మార్షల్స్‌తో బలవంతంగా సభ నుంచి బయటకు పంపించేశారు. ప్రజాస్వామ్య విరుద్ధంగా బడ్జెట్‌పై ఎలాంటి చర్చ జరగకుండానే ఆమోదిస్తున్నట్లు మేయర్ ప్రకటించి.. అన్ని పార్టీలను విస్మయానికి గురి చేశారు. ప్రజాస్వామ్య యుతంగా ప్రభుత్వ వైఖరిపై ప్రజాక్షేత్రంలో పోరాడుతున్న బీఆర్‌ఎస్ కార్పొరేటర్లను అణగదొక్కే విధంగా సభ వ్యవహరించిన తీరుపై గ్రేటర్ వాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మేయర్ అధ్యక్షతన పాలక మండలి సమావేశం ఉదయం 10.35 గంటలకు ప్రారంభమైంది.10.37 నిమిషాలకు దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, ప్రముఖ వ్యాపార దిగ్గజం రతన్ టాటా మృతికి సంతాపంగా రెండు నిమిషాల పాటు సభ మౌనం పాటించి నివాళులర్పించింది. అనంతరం ఆర్థిక సంవత్సరం (2025-26)కు సంబంధించిన రూ.8440 కోట్ల బడ్జెట్‌ను సభలో ప్రవేశపెట్టి అన్ని పార్టీల సభ్యులకు చర్చకు అవకాశం కల్పించాలి. అయితే మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాత్రం చర్చ జరగకుండానే బడ్జెట్‌ను ఆమోదిస్తున్నట్లు ప్రకటించారు. అంతకు ముందు ఆరు గ్యారంటీలను అమలు చేయాలని, హైదరాబాద్ నగరానికి సరిపడా నిధులను వెంటనే మంజూరు చేయాలని ప్లకార్డులతో బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు నిరసన తెలిపారు. దీంతో తొలుత నలుగురు కార్పొరేటర్లను జీహెచ్‌ఎంసీ అవతల ఉన్న వ్యాన్‌లో ఎక్కించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వీరిని అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ హాల్‌లో మిగతా కార్పొరేటర్లు నిరసన వ్యక్తం చేశారు.పోడియం వద్దకు వెళ్లిన బీఆర్‌ఎస్ కార్పొరేటర్ల చేతిలో ఉన్న ప్లకార్డులను కాంగ్రెస్ కార్పొరేటర్లు సీఎన్ రెడ్డి, బాబా ఫసియుద్దీన్లు లాక్కుని చించేశారు. కాంగ్రెస్ కార్పొరేటర్లు మహిళా కార్పొరేటర్లు అని చూడకుండా నెట్టేశారు. ఇదే అదనుగా సభ జరగకుండా అడ్డుకున్నారన్న కారణంతో మేయర్ ఆదేశాల మేరకు జీహెచ్‌ఎంసీ సెక్షన్ 89/1 ప్రకారం మార్షల్స్‌తో బీఆర్‌ఎస్ కార్పొరేటర్లను బయటకు తీసుకువెళ్లారు. కాగా, కౌన్సిల్ ప్రశ్నోత్తరాల సందర్భంగా అన్ని పార్టీల సభ్యులు సమస్యలపై ఏకరువు పెట్టారు. అధికార పార్టీ కార్పొరేటర్లే స్వయంగా ప్రజా సమస్యలు పెరిగిపోతున్నాయంటూ సభలో మేయర్ ముందు ఆవేదన వ్యక్తం చేశారు.పారిశుధ్య నిర్వహణ ఏ మాత్రం బాగులేదని, కోచ్‌లు లేక క్రీడారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని, వీధి దీపాలు లేక ప్రమాదాలు, దోపిడీలు పెరిగిపోయాయని, మురుగునీటి , నాలా సమస్యలతో ప్రజల్లోకి వెళ్లలేకపోతున్నామని స్వయంగా డిప్యూటీ మేయర్ మొదలుకొని కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి, జగదీశ్వర్ గౌడ్ విమర్శించారు. కాగా, సర్వసభ్య సమావేశం సందర్భంగా జీహెచ్‌ఎంసీ కార్యాలయాన్ని పోలీసులు తమ గుప్పిట్లోకి తీసుకున్నారు. అంతేకాకుండా మార్షల్స్ బీఆర్‌ఎస్ కార్పొరేటర్లను హాల్ నుంచి బయటకు తీసుకువెళ్లే సమయంలో అత్యుత్సాహం ప్రదర్శించారు. మహిళా కార్పొరేటర్లు అని చూడకుండా వారిని బయటకు లాక్కుని వచ్చి వ్యాన్‌లోకి ఎక్కించారు. ఈ సందర్భంగా కొందరు మహిళా కార్పొరేటర్లకు స్వల్ప గాయాలయ్యాయి.

## జైపూర్ నుంచి పూణేకు పాకిన కొత్త వ్యాధి..

ముంబై:మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ తర్వాత జార?ండ్‌కు వింత వ్యాధి చేరుకుంది. ఆ రాష్ట్ర రాజధాని రాంచీలో 5 ఏళ్ల బాలిక ఈ వ్యాధితో బాధపడుతోంది.తనను ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చారు. ఆ బాలికలో గులియన్-బారే సింద్రోమ్ అనే వ్యాధి లక్షణాలను వైద్యులు కనుగొన్నారు. ఈ వ్యాధి వార్తలు ప్రజలలో భయాందోళనలను సృష్టించాయి. బాలిక ట్రావెల్ హిస్టరీని పరిశీలించారు. ఆమె మహారాష్ట్ర నుండి తిరిగి వచ్చినట్లు తెలిసింది. బాలిక నడవడానికి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడడం ప్రారంభించడంతో ఆమె తల్లిదండ్రులు ఆమెను ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. తనను పిల్లల నిపుణులైన వైద్యుడు పరీక్షించారు. దీని తరువాత, ఆ బాలిక గుల్లెయిన్-బారే సింద్రోమ్ అనే వ్యాధితో బాధపడుతున్నట్లు కనుగొన్నారు. ప్రస్తుతం ఆ బాలిక ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది.సోకిన బాలికకు చికిత్స చేస్తున్న డాక్టర్ రాజేష్ ప్రకారం.. ఆ బాలికను దాదాపు 8 రోజుల క్రితం చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్చారు. ప్రాథమిక దర్యాప్తులో ఆ బాలికకు గుల్లెయిన్-బారే సింద్రోమ్ లాంటి లక్షణాలు ఉన్నట్లు కనుగొనబడింది. దాని ఆధారంగానే ఆ బాలికకు చికిత్స అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. బాధిత బాలిక విషయానికొస్తే, ఆమె ప్రయాణ చరిత్ర మహారాష్ట్ర అని కూడా తెలిసింది. ఆమె కొన్ని రోజుల క్రితమే మహారాష్ట్ర నుండి తిరిగి వచ్చింది. ఈ వ్యాధి రాక జార?ండ్ ప్రభుత్వ ఆరోగ్య శాఖలో భయాందోళనలను సృష్టించింది. ఆ బాలిక అనారోగ్యం గురించి రాంచీ సివిల్ సర్జన్‌కు సమాచారం అందింది. బాలిక నమూనాను కూడా పరీక్ష కోసం పూణేకు పంపారు.ఆరోగ్య నిపుణులు గుల్లెయిన్-బార్ సింద్రోమ్ అంటే GBS అనేది



ఒక ఆటో ఇమ్యూన్ న్యూరోలాజికల్ డిజార్డర్ అని అంటున్నారు. ఈ వ్యాధి సోకినప్పుడు.. మానవ వ్యవస్థ దాని స్వంత శరీరంలోని నరాలపై దాడి చేస్తుంది, దీని కారణంగా రోగి నడవడంలో, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడతాడు. ఈ వ్యాధి బారిన పడే ప్రమాదం ఎక్కువగా పిల్లలు, వృద్ధులకు ఉంటుంది. దీని వ్యాప్తి కారణంగా.. దేశంలోని అనేక రాష్ట్రాల్లోని పిల్లలు దీని బారిన పడ్డారు. మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ సహా అనేక ఇతర రాష్ట్రాలలో కూడా ఈ వ్యాధి కారణంగా మరణాలు సంభవించాయి. వైద్యుడి ప్రకారం, ఈ వ్యాధి గురించి భయపడాల్సిన అవసరం లేదు. బదులుగా కొన్ని అవసరమైన చర్యలు తీసుకోవడం ద్వారా దీనిని నివారించవచ్చు. వేడి నీరు త్రాగడం, కలుషితమైన నీరు త్రాగకుండా ఉండటం, పచ్చి లేదా తక్కువగా ఉడికించిన మాంసం తినకుండా ఉండటం మంచిది.

## జగన్ ఒక్క ఛాన్స్ మాత్రమే అడిగారు.. జమిలితో చంద్రబాబుకే నష్టం..!



అమరావతి,ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుతో పాటు.. మాజీ సీఎం వైఎస్ జగన్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీ చింతా మోహన్.. గుంటూరులో మీడియాలో మాట్లాడిన ఆయన..జగన్ ఒక్క ఛాన్స్ మాత్రమే అడిగారు.. రెండో ఛాన్స్ లేదు.. అడిగినా ప్రజలు అవకాశం ఇవ్వరు అని పేర్కొన్నారు.. మళ్లీ ఏపీలో జగన్ బలపడే అవకాశం లేదని జోస్యం చెప్పారు.. ఇక, జమిలి వస్తే చంద్రబాబుకు నష్టం.. అందుకే జమిలి ఎన్నికలకు చంద్రబాబు ఒప్పుకోరని పేర్కొన్నారు.. జమిలి ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ పార్టీకి నష్టం లేదన్నారు చింతా మోహన్.. ఇక, కాంగ్రెస్ నాయకులు ప్రజల్లో తిరగడంలేదు.. హైదారాబాద్ లో కూర్చుంటే పనులు జరగడం లేదు.. ప్రస్తువం ఈవీఎంల మేనేజ్‌మెంట్ జరుగుతోంది.. గెలవాలి అంటే ప్రజల్లోకి వెళ్లి కష్టపడాలని సూచించారు..మరోవైపు.. దళితులపై వివక్ష, అంటరానితనం ఎలా ఉంటుందో కళ్లారా చూసిన వ్యక్తిని నేను అన్నారు చింతా మోహన్.. ఒకప్పుడు దళితుల నాడి పట్టుకుని వైద్యం చేయడానికి కూడా వెనకాడేవారని పేర్కొన్న ఆయన.. మూతికి ముంత, వెనుక తాటాకు కట్టుకుని తిరిగిన ఘటనలు ఎన్నో ఉన్నాయి.. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అంటరాని తనం రూపు మాపాలని గాంధీకి నెహ్రూకు చెప్పారు.. రాజ్యాంగంలో ఎస్సీలకు 15 శాతం ఇచ్చిన ఘనత, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కిచ, కాంగ్రెస్ నాయకులకు దక్కిందన్నారు.. అయితే, ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పులో లోపాలు ఉన్నాయి.. పక్క రాష్ట్రాల్లో అమలు చేయలేని వర్గీకరణను ఏపీలో చంద్రబాబు అమలు చేయాలని చేస్తున్నారు.. ఏకసభ్య కమిటీ పేరుతో చేస్తున్న ప్రయత్నాలు ఆపాలని డిమాండ్ చేశారు.. చంద్రబాబుకి దళితుల చేసిన అన్యాయం ఏంటి? అని నిలదీశారు. దళితులను ఎందుకు విభజించాలని చూస్తున్నారు.. తిరుపతిలో పెట్టాల్సి న రాజధాని విజయవాడలో పెడితే రాయల సీమ ప్రాంతం ఏం అవ్వాలి? అని ప్రశ్నించారు.. రాయల సీమ వాళ్లు బయట పడటం లేదు.. కానీ, ఉడికి పోతున్నారని పేర్కొన్నారు..ఇక, A అంటే అమరావతి P అంటే పోలవరం అని చెప్పుకునే చంద్రబాబు రాష్ట్రం మొత్తాన్ని అభివృద్ధి చేయాలని సలహా ఇచ్చారు చింతామోహన్.. ఒక్కో జిల్లా అభివృద్ధికి 5 వేల కోట్లు ఖర్చు పెట్టాలి.. 60 వేల కోట్లు ఒక్క చోటే పెట్టాల్సి న అవసరం లేదన్నారు. వర్గీకరణ ఉద్యోగాలలో జరగాలి ఎస్సీ కాంట్రాక్టర్ లకు అవకాశాలు ఇవ్వాలి.. బ్యాంక్ ఉద్యోగాలలో ఎస్సీలకు అవకాశాలు ఇవ్వాలని కోరారు.. నేను వర్గీకరణ కు వ్యతిరేకం.. వర్గీకరణ చేస్తే టీడీపీ పతనం అవుతుందని జోస్యం చెప్పారు.. వైసీపీ విజయవాడ లో అంబేద్కర్ విగ్రహం పెట్టి మంచి పని చేసిందని ప్రశంసలు కురిపించారు.. అయితే, కర్నూలులో హై కోర్టు బెంచ్ వల్ల ప్రయోజనం లేదు.రాయలసీమ ప్రాంతంలో ఉపాధి కావాలని కోరారు మాజీ ఎంపీ చింతా మోహన్..

## పిజి వైద్య విద్యలో రాష్ట్ర రిజర్వేషన్ లు రద్దు



న్యూ ఢిల్లీ : వైద్యవిద్యలో నివాస ఆధారిత కోటాను సుప్రీంకోర్టు రద్దు చేసింది. రాష్ట్ర కోటా కింద పీజీ సీట్ల కేటాయింపులో అనుసరిస్తున్న ఈ పద్ధతి రాజ్యాంగ విరుద్ధమని స్పష్టంచేసింది. ఈ మేరకు బుధవారం ముగ్గురు సభ్యుల ధర్మాసనం తీర్పు ఇచ్చింది. "మనకు దేశంలో ఎక్కడైనా నివసించే హక్కు ఉంది. దేశంలోని ఏ విద్యాసంస్థలోనైనా చదువుకునే హక్కును రాజ్యాంగం ప్రసాదించింది. మనమంతా భారత్ భూభాగంలో నివసిస్తున్నాం కాబట్టి ఏ ప్రావిన్స్, ఏ రాష్ట్ర నివాసం అనే ప్రశ్నే ఉత్పన్నం కాదు. ఉద్యోగం, వ్యాపారం చేసుకోవడానికి దేశంలో ఎక్కడైనా ఉండే హక్కు ఉంది. అలాగే చదువుకునే హక్కు కూడా" అని ధర్మాసనం వెల్లడించింది.నిర్దిష్ట రాష్ట్రంలో నివసించేవారి విషయంలో రిజర్వేషన్ల గురించి ఆలోచించవచ్చని, అయితే అది అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల వరకే అని వ్యాఖ్యానించింది. ఆ తర్వాత ఉన్నతవిద్యా కోర్సుల విషయంలో నివాస ప్రాంతాన్ని ప్రాతిపదికగా తీసుకుంటే.. ఆర్టికల్ 14ను ఉల్లంఘించినట్లే అవుతుందని పేర్కొంది. అయితే ఇప్పటికే జారీ అయిన నివాస ఆధారిత రిజర్వేషన్లకు ఈ తీర్పు వర్తించదని పేర్కొంది.పీజీ మెడికల్ కోర్సులకు నివాస ఆధారిత రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమని గతంలో పంజాబ్-హరియాణా కోర్టు తీర్పు ఇచ్చింది. దీనిని పలువురు సుప్రీంకోర్టు లో సవాల్ చేయగా.. ఇద్దరు సభ్యుల ధర్మాసనం హైకోర్టు తీర్పును సమర్థించింది. అయితే కేసు ప్రాముఖ్యత దృష్ట్యా దానిని ముగ్గురు సభ్యుల ధర్మాసనానికి సిఫారసు చేసింది. ఈక్రమంలోనే తాజా తీర్పు వెలువడింది.

### టీటీడీ అన్న ప్రసాదానికి రూ. కోటి విరాళం

అమరావతి,జనవరి31:తిరుమల వేంకటేశ్వరస్వామికి చెన్నైకి చెందిన ఓ భక్తుడు భారీ విరాళాన్ని అందజేశారు. సెన్సార్ క్యాపిటల్ కంపెనీ ఎండీ, సీఈవో వెంకటేష్ కన్నపన్ టీటీడ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ. కోటి డీడీని శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరికి శుక్రవారం అందజేశారు. జనవరి 8న తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటనలో గాయపడిన భక్తురాలికి టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు పరిహారాన్ని అందించారు. కడప జిల్లా వీరపునాయనపల్లి మండలం, సర్వరాజుపేట కాలనీకి చెందిన బాధితురాలు జి. శైలజ గాయపడి ఆసుపత్రిలో చికిత్సపొందింది. ఈ సందర్భంగా రూ. 2 లక్షల డీడీని శుక్రవారం తిరుమలలోని చైర్మన్ క్యాంప్ కార్యాలయంలో బాధితురాలికి బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, శాంతారాంతో కలిసి అందజేశారు.

### విద్యాసంస్థల్లో దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్లు

హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్ ఉన్నత విద్యాసంస్థల్లో దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అదనంగా, ఆయా వర్గాల విద్యార్థుల ప్రవేశాలకు గరిష్ట వయోపరిమితిలో 5 సంవత్సరాల మినహాయింపు అందజేశారు. దివ్యాంగుల హక్కుల చట్ట నిబంధనల ప్రకారం, ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా ఈ ఉత్తర్వులను విడుదల చేశారు.

## గోషామహల్ బంద్‌కు స్థానికులు,వ్యాపారులు పిలుపు..

హైదరాబాద్,గోషామహల్ స్టేడియంలో నూతన ఉస్మానియా హాస్పిటల్ శంకుస్థాపనకు నిరసనగా స్థానికులు, వ్యాపారులు గోషామహల్ బందుకు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో పోలీసులు స్టేడియం చుట్టూ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.ప్రతి ఒక్కరినీ తనిఖీ చేసి పంపుతున్నారు. నిఘా వర్గాల హెచ్చరికతో స్టేడియంలో భారీగా నిర్వహించాల్సిన సభ వాయిదా పడింది. నిన్న భారీగా ఏర్పాటు చేసిన టెంట్ నీ తొలగించి కేవలం సీఎం రేవంత్ శంకుస్థాపన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఇక, ఈరోజు బందు పాటించాలని గోషామహల్ పరిరక్షణ సమితి పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా గోషామహల్ స్టేడియంలో ఉస్మానియా ఆస్పత్రిని నిర్మించాలని సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి.. లేకపోతే, ముఖ్యమంత్రిని అడ్డుకుంటామని స్థానికులు, గోషామహల్ పరిరక్షణ సమితి హెచ్చరించింది. ఈ నేపథ్యంలో అర్ధరాత్రి నుంచి పరిరక్షణ సమితి నాయకులను, స్థానికులతో పాటు అన్ని పార్టీలకు చెందిన నాయకులను, కార్యకర్తలను అరెస్ట్ చేసి పోలీసుస్టేషన్ లో



నిర్బంధించారు. అలాగే, రోడ్లను మూసివేసి బస్తీ వాసులను బయటికి రాకుండా ఎక్కడికక్కడ పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పాటు ఉదయం నుంచి ఫ్లైవుడ్ దుకాణాలు, ఇతర వ్యాపార సముదాయాలు బందు పాటిస్తున్నాయి.

## సంపాదకీయం

శనివారం 01-02-2025

### జ్ఞానమొక్కటే నిలిచి వెలుగును

నేడు దేశాన్ని పట్టిపీడిస్తున్న వాటిలో కులం, మతం, జాతుల సమస్యలు ముఖ్యమైనవి. చరిత్రలో మతం ప్రజలను ఏకం చేసిన దృష్టాంతాల కన్నా వైషమ్యాలు, విద్వేషాలు రెచ్చగొట్టే దుస్సంఘటనలే ఎక్కువగా కనిపిస్తాయి. దేశవిభజన సందర్భంగా చెలరేగిన మతఘర్షణలు, అయోధ్యలో బాబ్రీ మసీదు కూల్చివేత, మైనార్టీలపై మూకదాడులు, మత అల్లర్లు ఇందుకు కొన్ని ఉదాహరణలు. మత ఉన్మాదం, పరమత ద్వేషం వంటివి చరిత్రలో అనేక సందర్భాల్లో రక్తపాతానికి దారితీశాయంటే అతిశయోక్తి కాదు. 'మనిషిని మంచి బాటలో నడిపించే కళ్లెమన్న మాటేమోగాని కత్తికట్లార్లిచ్చి ఉన్మాదప్పురెక్కించడం మాత్రం చరిత్రనిండిన ఖరాబు' అంటారో రచయిత. దేశంలో మనిషి పుట్టుకను బట్టి మత ముద్ర పడుతోంది. మత భావన, విశ్వాసం, మతాభిమానం ఉగ్గుపాలతో రంగరించి పోస్తున్నారు. ఇది క్రమేణా దురభిమానంగా, పరమత విద్వేషంగా మారితే జరిగే పరిణామాలేమిటో దేశం చూసింది. పాలకవర్గాల చేతిలో ఇదొక ఆయుధంగా మారుతోంది. 'ఎల్లలోకము వొక్కయిల్లై %-% వర్ణ భేదములెల్ల కల్లై/ వెల నెరుగని ప్రేమబంధము- వేడుకలు కురియ/ మతములన్నియు మాసిపోవును- జ్ఞాన మొక్కటే నిలిచి వెలుగును' అంటారు గురజాడ. ఆయన స్వప్నానికి సరిగ్గా 114 సంవత్సరాలైంది. ఈనాటికీ ఆయన కోరుకున్న సమాజం రాలేదు.మతం వ్యక్తిగతం. మతాన్ని, రాజకీయాలను కలగాపులగం చేయకూడదు. మత స్వేచ్ఛవేరు, రాజకీయాల్లో మతాన్ని చొప్పించడం వేరు. ప్రస్తుతం అధికారంలో వున్న బిజెపి%% ఈ రెండింటినీ కలగాపులగం చేసింది. సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సొసైటీ అండ్ సెక్యులరిజం (సిఎస్ఎస్ఎస్) నివేదిక ప్రకారం.. భారతదేశం 2024లో 59 మతపరమైన అల్లర్లను చూసింది. 2023లో జరిగిన 32 అల్లర్లతో పోల్చితే ఇది 84శాతం ఎక్కువ. ముఖ్యంగా మతపరమైన పండుగలు, ఊరేగింపుల సమయంలో ఈ అల్లర్లు జరిగినట్లు ఈ నివేదిక వెల్లడించింది. వీటిలో ఏడు సంఘటనలు గోహత్య ఆరోపణలతో ముడిపడి వున్నాయి. మతం పేరిట ఏ వికృతమైనా చెలామణి అయినట్లే%% మొత్తం ఈ అల్లర్లలో అత్యధికం ముస్లిములు లక్ష్యంగా జరిగినవే. ఈ మత విద్వేషాల విచ్చుకత్తుల ధాటికి భారతీయ సాంస్కృతిక ఔన్నత్యం ఛిద్రమౌతోంది. 'ఇది 21వ శతాబ్దం. మతం పేరిట మనమెక్కడికి దిగజారిపోతున్నాం%% విద్వేష నేరాలను ఉపేక్షిస్తే, ఏదోకనాటికి అవి మీ తలుపూ తడతాయి. ఆపై అమాయకుల ప్రాణాలెన్నో కడతేరిపోతాయి' అని ఓ సందర్భంలో సర్వోన్నత న్యాయస్థానం హెచ్చరించింది. ప్రసార మాధ్యమాల్లో వెల్లువెత్తుతున్న విద్వేష వ్యాఖ్యలకు భారత ప్రభుత్వం మౌన ప్రేక్షకురాలిగా మిగిలిపోతోందెందుకు? దీన్నో స్వల్ప విషయంగా భావిస్తున్నారెందుకు?' అని కూడా లోగడ కేంద్రాన్ని తీవ్రంగానే మందలించింది. విశేషమేమిటంటే- ఈ మతపరమైన అల్లర్లన్నీ బిజెపి పాలిత లేదా ఇతర పార్టీలతో సంకీర్ణంలో పాలన చేస్తున్న రాష్ట్రాల్లోనే జరిగాయి.మతం మర్రిచెట్టులా విస్తరించింది. అజ్ఞానమే జ్ఞానమై రాజ్యమేలుతున్నది. ప్రసార మాధ్యమాలను ఉపయోగించుకొని, అజ్ఞానానికి సరికొత్త వ్యాఖ్యానాలు జోడించి జనం మీదికి చిమ్ముతున్నారు. ప్రశ్నించిన వాళ్లను వెంటాడి, వేటాడి హింసిస్తున్నారు. 'దేశ మనియెడి దొడ్డ వృక్షం/ ప్రేమలను పూలెత్త వలెనోయి' అంటారు గురజాడ. ప్రజల మధ్య విద్వేషాగ్నులు రగిలించే వారికి ఈ ఒక్కమాట చాలు. కులం, మతం, జాతి, వర్ణం వంటి ముక్కలు ముక్కలైన ఇరుకైన గోడల మధ్య ప్రపంచం మగ్గిపోకూడదు. 'కుల మతాలను వొదిలిపెట్టడం ఒక మహత్కార్యం కాదు. కాని వొదిలిపెట్టలేకపోవడం అల్పత్వం, భీరుత్వం, అంధత్వం. వీటన్నిటికన్నా గొప్పది అసలైన మనిషితనం' అంటారు చలం. మానవ ప్రేమ పునాదిగా కులమతాల ప్రసక్తిలేని అసలైన లౌకిక భారతదేశం ఆవిర్భవించేదాకా%% జ్ఞానమయమైన సమాజం రూపొందేదాకా%% లౌకిక, భౌతిక, ప్రజాతంత్ర వాదులంతా విజ్ఞానం స్వేచ్ఛగా మనగలిగే ప్రపంచం కోసం, మత సామరస్యం కోసం ప్రతినబూనాలి.

# విజయసాయి రాజకీయ సన్యాసంపై అనుమానాలు?



అమరావతి,అధికారం ఉంటే దుర్యోధనుడిలా విర్రవీగడం..అధికారం లేకుంటే పాండవుల్లా అజ్ఞాతవాసం చేయడం ఇప్పుడు రాజకీయాల్లో కనిపిస్తున్న ధోరణి. మరో ఐదేళ్ల వరకు రాజకీయాలకు దూరంగా ఉండడం మేలన్న భావనలో కొందరు..అధికార పార్టీలో చేరడంలోమరికొందరు కాలం వెళ్లదీస్తున్నారు. నిజానికి నిబద్ధ రాకీయాలు,. నిజాయితీ రాజకీయాలకు కాలంచెల్లింది. ప్రజాసేవ ముసుగులో అందరూ చేసేది స్వార్థ వ్యాపారాలే తప్ప మరోటి కాదు. ఎపిలో ఇప్పుడు పలువురు రాజకీయ నేతల తీరు దీనికి అద్దం పడుతోంది. వైకాపాకు చెందిన రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి హఠాత్తుగా రాజీఆనామ నిర్ణయం ఎందుకు తీసుకున్నారన్న అనుమానం సహజంగానే కలుగుతుంది. నిజానికి ఇది హఠాత్తుగా తీసుకున్న నిర్ణయం కాదు. ఏడు మాసాల క్రితం జరిగిన ఎన్నికల్లో వైసీపీ చిత్తుగా ఓడిపోయిన నాటి నుంచి ఆయన వైఖరిలో మార్పు వచ్చింది. అధికారంలో ఉన్నప్పుడు కూడా జగన్‌రెడ్డి ఆయనను దూరం పెట్టారు. దీంతో ఆయన పార్టీలో పూర్వ వైభవం కోసం ప్రయత్నిస్తూ వచ్చినా ఆ ప్రయత్నాలు ఫలించలేదు. ఎన్నికల్లో ఓడిపోవడంతో పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉండాలని ఒక దశలో భావించారు. అయితే జగన్‌రెడ్డి ఒత్తిడి తేవడంతో పార్టీ ఉత్తరాంధ్ర వ్యవహారాల ఇంచార్జిగా మళ్లీ బాధ్యతలు చేపట్టారు. భవిష్యత్తులో తాను ఏ రాజకీయ పార్టీలోనూ చేరబోవడం లేదని కూడా విజయసాయిరెడ్డి తాజాగా ప్రకటించారు. అయితే విజయసాయిరెడ్డి సేవలు అవసరమని భావిస్తే జగన్ మళ్లీ పిలుస్తారు. అధికారం వస్తే అన్నీ తారుమారవుతాయని చూస్తూనే ఉన్నాం. తెలుగుదేశం పార్టీ తనను దగ్గరకు రానివ్వదు కనుక భారతీయ జనతా పార్టీలో చేరిపోవాలని కొన్ని రోజుల క్రితం ఆయన భావించారు. తనతో పాటు ఏడెనిమిది మంది రాజ్యసభ సభ్యులను తీసుకువస్తానని, పార్టీలో చేర్చుకోవాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలసి అర్జీ పెట్టుకున్నట్లు వార్తుల వచ్చాయి. అయితే కేంద్రంలో ప్రధాని మోదీ ప్రభుత్వం ఏర్పడటానికి కారణం అయిన తెలుగుదేశం పార్టీ ఆమోదం లేకుండా పార్టీలో చేర్చుకోలేమని విజయసాయికి తెగేసి చెప్పారు. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ నుంచి వ్యతిరేకత రాకుండా చూడడం సాధ్యం కాక పోవడంవల్లనే ఆయన తప్పుకున్నారని అంటున్నారు. జగన్‌రెడ్డిపై పెండింగ్‌లో ఉన్న అవినీతి కేసులలో అప్రూవర్‌గా మారితే భారతీయ జనతా పార్టీలో చేరడానికి తాము క్లియరెన్స్ ఇస్తామని తెలుగుదేశం ముఖ్యులు ఆయనకు స్పష్టంచేశారన్న ప్రచారం కూడా జరుగుతోంది. అవినీతి కేసులలో అప్రూవర్‌గా మారితే తనకు ముప్పు తప్పదని భావించిన విజయసాయి రెడ్డి.. మనసు మార్చుకున్నారని మరికొందరి ప్రచారంగా ఉంది. 2029 నాటికి చంద్రబాబు బతికుంటే అప్పుడు తాము అధికారంలోకి వచ్చి ఆయనను జైలుకు పంపుతామని విజయసాయిరెడ్డి హెచ్చరించారు కూడా. బహిరంగ చర్చకు రావాలంటూ సవాలు విసిరి తోక ముడిచారు. చంద్రబాబును తిడుతూనే జనసేనాని పవన్ కల్యాణ్‌ను కీర్తించారు. కూటమిలో విభేదాలు సృష్టించే ప్రయత్నాలు చేశారు. వాస్తవానికి వైఎస్ రాజశేఖరరెడ్డితో విజయసాయికి పరిచయం ఏర్పడిన నాటి నుంచి ఆ కుటుంబానికి విధేయుడిగా ఆయన ఉండిపోయారు. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆడిటర్‌గా తన తెలివితేటలను ఉపయోగించి క్విడ్ ప్రో కోకు తెర లేపారు. జగన్‌రెడ్డితో అనతికాలంలోనే వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మింపజేశారు. మన దేశంలో రాజకీయ అధికారాన్ని మించిన అధికారం లేదు. అలాంటిది ఉన్న ఎంపీ పదవిని కూడా ఆయన ఎందుకు వదులుకుంటున్నారన్న ప్రశ్నలు వస్తున్నాయి. జగన్‌పై సీబీఐ, ఈడీ కేసులలో విచారణ ముందుకు సాగకుండా ఢిల్లీ స్థాయిలో విజయసాయి తన వంతు కృషి చేశారని అంటున్నారు. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాలకు విధేయుడిగా మారిపోయారు. ఈ విధంగా స్వామి కార్యం, స్వకార్యం చక్కదిద్దుకుంటూ వచ్చారు. అయితే కుటుంబపరంగా, రాజకీయంగా సమస్యలు చుట్టుముట్టడంతో ఆయన కొన్ని రోజులుగా మానసికంగా నలిగిపోయారని చెబుతున్నారు. ఇకపోతే రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో వారి పాపాలు ఒక్కొక్కటిగా బయటికొస్తున్నాయి. మద్యం, ఇసుక, భూముల విషయాల్లో విజయసాయిరెడ్డి చేతివాటంపై చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. రాష్ట్రంలో, అటు కేంద్రంలో ప్రతికూల పరిస్థితులు ఉండటంతో ఇక లాభం లేదనుకున్న విజయసాయిరెడ్డి రాజకీయ సన్యాసం తీసుకుంటున్నట్టు ప్రకటించి ఉంటారు. రాజ్యసభ్యుడిగా ఉన్నా జగన్‌కు అనుకూలంగా ఉండలి. అదికూడా లేకపోతే స్వేచ్ఛగా ఉండొచ్చన్న సూచలనతో ఆయన రాజీనామా చేశారని అంటున్నారు. మొత్తంగా మున్ముందు ఏ కేసు ఎలా ముందుకు వస్తుందో ఇప్పుడేచెప్పలేం.

# శాంతి ఒప్పందాలు కాగితాలకే పరిమితం

సెంట్రల్ డెస్క్:అసోంలో తిరుగుబాటు దారుల ముఠాల కార్యకలాపాలను అరికట్టడంలో తమ ప్రభుత్వం గణనీయమైన విజయం సాధించిందని అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ చెప్పుకున్నారు. 2021 నుంచి అసోంలో జోరుగా కార్యకలాపాలు సాగిస్తున్న తిరుగుబాటు సంస్థలతో ప్రభుత్వం నాలుగు శాంతి ఒప్పందాలపై సంతకాలు చేసింది. 2020లో ముఖ్యమంత్రిగా శర్బానంద సోనోవాల్ ముఖ్యమంత్రిగా ఉండగా ఆల్ బోడో స్టూడెంట్ యూనియన్ (ఎబిఎస్‌యూ), నేషనల్ డెమొక్రటిక్ ఫ్రంట్ ఆఫ్ బోడోలాండ్ (ఎన్ డిఎఫ్ బి), అసోం ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం మధ్య శాంతి ఒప్పందంపై సంతకాలు జరిగాయి. అందువల్ల ఆ ఐదు శాంతి ఒప్పందాలను అమలు చేసే బాధ్యతలు హిమంత బిశ్వ శర్మ ప్రభుత్వం భుజస్కంధాలపై ఉంది. అయితే శాంతి ఒప్పందాలలో పలు క్లాజ్ లు అమలు తీరును పరిశీలిస్తే.. తిరుగుబాటు దార్ల పునరావాసం ప్యాకేజీలు, వివిధ డెవలప్ మెంట్ ప్రాజెక్టులకు కేటాయించిన సొమ్ము అంతంత మాత్రమే. పరిస్థితి నిరాశాజనకంగా ఉంది.డాక్టర్ హిమంత బిశ్వ శర్మ హయాంలో 2021 సెప్టెంబర్ 4న కర్బి అంగ్ లాంగ్ శాంతి ఒప్పందం , 2022 సెప్టెంబర్ 15న ఆదివాసి శాంతి ఒప్పందం, 2023 ఏప్రిల్ 27న దిమ్సా శాంతి ఒప్పందం, 2023 సెప్టెంబర్ 29న యూఎఫ్ ఎల్ ఏ శాంతి ఒప్పందం, 2020 జనవరి 27న బోడో శాంతి ఒప్పందం పై సంతకాలు జరిగాయి. రాష్ట్రప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం బోడో తిరుగుబాటు సంస్థల మధ్య సంతకాలు జరిగాయి. ఈ ఒప్పందాలలో కొన్ని రాజకీయ నిర్ణయాలు తప్ప, పలు నిర్దుష్టమైన ప్రదేశాలలో మౌలికవసతుల కల్పన ప్రాజెక్టులు, విద్యా పరమైన, సాంస్కృతిక పరమైన ప్రాజెక్టుల తో సహా ఈ ఒప్పందాలు ఏవీ ఇంతవరకూ అమలు కాలేదు.శాంతి ఒప్పందాలపై సంతకాలు చేసిన సంస్థల నాయకులు ఢిల్లీకి వెళ్లి కేంద్ర హెూం మంత్రిని, హెూం సెక్రటరీనీ కలిసి ఈ ప్రాజెక్టుల అమలుకు నిధులు కేటాయించాలని కోరుతూనే ఉన్నారు. లొంగిపోయిన తిరుగుబాటు దారుకు ఒకొక్కరికీ రూ. 4 లక్షల రూపాయలు మంజూరు చేయడం తప్ప ప్రభుత్వం అంతకన్నా ఏమీ చేయలేదు. ప్రభుత్వం ఇప్పటివరకూ ఎన్డిఎఫ్ బి కి చెందిన 4203 మంది, డిఎన్ ఎల్ ఏకు చెందిన 181 మంది యుఎల్ ఎఫ్ ఏ కు చెందిన 936 మంది, కర్బి కిచెందిన 1926 మంది 1182 మంది ఆదివాసులు, 1155 మంది లొంగిపోయిన ఇతర తిరుగుబాటు దారులకు పునరావాసం కల్పించనట్లు తెలిపింది.బోడోలాండ్ ఒప్పందం ప్రకారం దివంగత ఉపేంద్ర నాథ్ బ్రహ్మ పేరుతో సెంట్రల్ యూనివర్సిటీని బోడోలాండ్ లోని బస్కా జిల్లాలో ఏర్పాటు చేయాలి. చిరాంగ్ జిల్లాలో స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సెంటర్ ఏర్పాటు చేయాలి. తంగ్లాలో ఒక ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లైవ్లీహుడ్ మేనేజ్‌మెంట్, రోయిమారీలోని ఈశాన్య వైద్య విజ్ఞాన సంస్థ, హెూటల్, టూరిజం మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, బోడో లాండ్ ఉద్యమ స్మారక మ్యూజియం, మిగతావి ఏర్పాటు చేయాలి. వీటికోసం ప్రభుత్వం రూ.1500 కోట్ల తో ప్యాకెజీ మంజూరు చేసేందుకు అంగీకరించింది. ఈ మొత్తంలో కేంద్రం రూ.750 కోట్లు, రాష్ట్రప్రభుత్వం రూ. 750 కోట్లు భరిస్తాయి.డాక్టర్ హిమంత బిశ్వ శర్మ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన వెంటనే 2021 సెప్టెంబర్ 4న కెఎన్ఎల్ ఎఫ్, పిడిసికె, యుపిఎల్ ఏ, కెపిఎల్ టి, కెపిఎల్ టి(ఎం)లకు హిల్ అటానమస్ జిల్లాక్ట్ ఏర్పాటుకు ఒప్పందంపై సంతకం చేసింది. కేంద్ర ప్రభుత్వం మొత్తం రూ.500 కోట్ల ను అటానమస్ డిస్ట్రిక్ట్ కోసం వచ్చే ఐదేళ్లలో మంజూరుచేసేందుకు అంగీకరించింది. అలాగే రాష్ట్రప్రభుత్వం కూడా ప్రతి ఏటా రూ.100 కోట్లు చొప్పున అంగీకరించింది. ఈ హిల్ డిస్ట్రిక్ట్ లో గ్రీన్ ఫీల్ ఎయిర్ పోర్ట్ తో సహా 27 ప్రాజెక్టులు, దూరదర్శన్ కేంద్రం, ఆకాశవాణి, పలు జాతీయ రహదారులు ఏర్పాటుకు అంగీకరించారు. 2022 సెప్టెంబర్ 15న ఎన్ఎల్ ఏ, ఎసిఎంఎ, బిసిఎఫ్, ఎస్ టిఎఫ్ వంటి ఆదివాసీ సంస్థలతో మరో శాంతి ఒప్పందం కుదిరింది. ఆదివాసీయులు పెద్దసంఖ్యలో ఉన్న ప్రదేశాలలో అభివృద్ధి ప్రాజెక్టుల అమలుకు రూ. 1000 కోట్లు గ్రాంట్ ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించింది.అలాగే దిమసా తెగతో మరో శాంతి ఒప్పందం కింద రూ.1000 కోట్ల ఖర్చుతో అభివృద్ధి ప్రాజెక్టులు అమలు చేస్తామని ప్రభుత్వం అంగీకరించింద. ఇంకా దిమా హసావో అటానమస్ జిల్లాలో మెడికల్ కాలేజీ, వ్యవసాయ కాలేజీ వంటివి ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం వాగ్దానం చేసింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో హింసాకాండను వదిలి,




జన జీవన స్రవంతిలో చేరేందుకు భారత రాజ్యాంగం పట్ల విశ్వాసం ప్రకటిస్తూ లొంగిపోయిన చాలా మంది తీవ్ర నిరాశ నిస్పృహలకు లోనయ్యారు. గతంలో ప్రభుత్వానికి లొంగిపోయిన వారిలో కొందరు మళ్లీ మిలిటెంట్ గ్రూప్ లలో తిరిగి చేరేందుకు సిద్ధమయ్యారు. వేలా సంఖ్యలో లొంగి పోయిన మిలిటెంట్లలో పలువురు ఏకమై కొత్తగా మరో మిలిటెంట్ ఆర్గనైజేషన్ ఏర్పాటుకు సిద్ధమయ్యారు.2003 డిసెంబరు 6న బోడో లిబరేషన్ టైగర్స్ కు చెందిన 2641 మంది మిలిటెంట్లు హింసను విడిచిపెట్టారు. కోక్రార్ఝర్ వద్ద ఆయుధాలు, మందుగుండు సామగ్రితో పాటు లొంగిపోయారు, ఏడు సంవత్సరాల తిరుగుబాటుకు ముగింపు పలికారు. ఆ మర్నాడే కోక్రార్ఝార్ లో 12 మంది సభ్యులతో బోడోలాండ్ టెరిటోరియల్ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఏర్పడింది. అయినా బోడోలాండ్ ప్రాంతంలో తిరుగుబాటు ముప్పు పూర్తిగా సమసిపోలేదు. ప్రత్యేక స్వతంత్ర బోడోలాండ్ డిమాండ్ తో నేషనల్ డెమోక్రటిక్ ఫ్రంట్ ఆఫ్ బోడోలాండ్-ఎన్ డిఎఫ్ బి- అనే కొత్త మిలిటెంట్ సంస్థ వెలిసింది. యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ అస్సాంకు చెందిన చాలా మంది సీనియర్ నాయకులు గ్రూపులతో ముందుగా లొంగిపోయారు, అయితే పరేష్ బారువా నాయకత్వంలోని ప్రధాన బృందం కొత్త క్యాడర్‌తో చురుకుగా మిలిటెంట్ కార్యకలాపాలకు చేపట్టింది.ఈశాన్య రాష్ట్రాల్లో మిలిటెన్సీ పెరగడానికి గల కారణాలను గుర్తించడంలో ప్రభుత్వం విఫలమైంది. ఈ ప్రాంతంలో తిరుగుబాటు దారులను బుజ్జగించేందుకు పైపై చికిత్సకే పరిమితమైంది. సైనిక పరిష్కారం మాత్రమే ఈశాన్యం, దేశంలోని ఇతర ప్రాంతాలలో తిరుగుబాటును తుడిచిపెట్టగలదని ప్రభుత్వం భావిస్తోంది. ఉదాహరణకు జమ్మూ కశ్మీర్ లో హింసాకాండను తగ్గించేందుకు కేంద్రప్రభుత్వం నిర్విరామంగా చేసిన కృషి ఫలితంగానే అక్కడి పెడ ధోరణలు బలహీన పడ్డాయని కేంద్ర సమాచార ప్రసారాలశాఖ మాజీ మంత్రి అనురాగ్ ఠాకూర్ 2022 డిసెంబర్ 21 వెల్లడించారు. అలాగే కేంద్ర ప్రభుత్వం కృషి ఫలితంగానే ఈశాన్య భారతంలో తిరుగుబాటు పరమైన హింసాకాండ 80 శాతం తగ్గిపోయిందని వెల్లడించారు. కేంద్రప్రభుత్వం చట్టవ్యతిరేక కార్యకలాపాల చట్టం (యుఏపిఏ) ను మరింత కఠినతరం చేసి, ఫెడరల్ వ్యవస్థలో చట్టపరమైన సవరణల ద్వారా ఎన్ ఐఏ -జాతీయ దర్యాప్తు సంస్థను పటిష్ట పరచేందుకు కేంద్రప్రభుత్వం కృషి చేసిందని అనురాగ్ ఠాకూర్ పేర్కొన్నారు. సమర్థవంతమైన కృషి కారణంగానే టెర్రరిజంకు దోహదపడే శక్తులు బలహీనమయ్యాయని మాజీ మంత్రి అన్నారు.తీవ్రవాద పోరాట చట్టాలను బలోపేతం చేయడం, 1958 సాయుధ బలగాల ప్రత్యేక అధికారాలు చట్టం (ఎఎఫ్ ఎస్ పిఏ) అమలు చేయడం ద్వారా కల్లోలిత ప్రాంతాలలో పరిస్థితి ప్రతికూలంగా మారుతుంది. ఇలాంటి చర్యలవల్ల మానవహక్కుల ఉల్లంఘన , సామూహిక అసంతృప్తి పెల్లుబకాడికి దారితీస్తుంది. ఈ పరిస్థితిని తిరుగుబాటు గ్రూపులు అనుకూలంగా మరల్చుకుని, మరింత మంది మిలిటెంట్లను చేర్చుకోవడానికి ఉపయోగించుకుంటాయి. ఈశాన్య రాష్ట్రాలుజాతుల పరంగా విభిన్నమైన సంస్కృతి సంప్రదాయాలు గలవి. వాటి విషయంలో రాజకీయ కోణంలో చూడడం ద్వారా అర్థం చేసుకోవడంతో జాతీయ నాయకులు విఫలమయ్యారు. ఈశాన్య భారతంలో నాలుగున్నర కోట్ల మంది ప్రజలు నివసిస్తున్నారు. భారతదేశంలో 635 గిరిజన తెగలు ఉంటే, ఈ రాష్ట్రాలలో దాదాపు 213 గిరిజన గ్రూప్ లు ఉన్నాయి. ప్రతి గిరిజన తెగకు ప్రత్యేక మైన సంస్కృతి, వివిధ్యం ఉంది.

# కిడ్నీ రాకెట్ కేసులో కీలక విషయాలు

హైదరాబాద్,తెలంగాణ వ్యాప్తంగా సంచలనం రేపిన కిడ్నీ రాకెట్ కేసులో కీలక విషయాలు బయటపడ్డాయి. ఎల్బీనగర్ వేదికగా అలకనంద హాస్పిటల్‌లో గుట్టుగా సాగుతున్న కిడ్నీ మార్పిడి రాకెట్ గుట్టు తేల్చారు పోలీసులు. ఈ కేసులో ఇప్పటివరకు 9 మందిని రాచకొండ పోలీసులు అరెస్టు చేశారు. అరెస్ట్ అయిన వారిలో చాలామంది డాక్టర్లు కూడా ఉన్నారు. విదేశాల్లో ఎంబీబీఎస్ పూర్తి చేసి ఇక్కడ ఎలాంటి ఇన్కమ్ లేకపోవడంతో కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్ చేసి డబ్బులు సంపాదించాలని ప్లాన్ చేశారు. ఇందులో భాగంగా డాక్టర్ అవినాష్, డాక్టర్ సుమంత్ ఇద్దరూ కలిసి భారీగా కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్ ఆపరేషన్లు చేశారు. మొదట డా. అవినాష్ సైదాబాద్‌లో జననీ హాస్పిటల్‌ను స్థాపించాడు. అందులో ఆయనకి ఆశించినంత సక్సెస్ రాకపోవడంతో 2022లో హాస్పిటల్ మూసేశాడు. తర్వాత డాక్టర్ సుమంత్ పరిచయం కావడంతో ఇద్దరు కలిసి సరూర్‌నగర్‌లో అలకనంద హాస్పిటల్ స్థాపించారు. ఈ హాస్పిటల్‌లో గుట్టు చప్పుడు కాకుండా కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు నిర్వహించేవారు. ఆరు నెలల వ్యవధిలో సుమారు 20కి పైగా కిడ్నీ ఆపరేషన్లు నిర్వహించారు. ఆపరేషన్ల నిర్వహణ కోసం ఇతర రాష్ట్రాల నుంచి సర్జరీ నిర్వహించే డాక్టర్లను అలకనంద హాస్పిటల్‌కు రప్పించారు.. సర్జరీ చేసే వైద్యుల్లో కీలకంగా తమిళనాడుకు చెందిన డాక్టర్ రాజశేఖర్‌తో పాటు జమ్ము కాశ్మీర్‌కు చెందిన డాక్టర్ సాహెబ్ ఉన్నారు. కిడ్నీలను డొనేట్ చేసేందుకు ఎక్కువగా పేద కుటుంబానికి చెందిన వారే ఆసక్తి చూపిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా కిడ్నీ అమ్మితే లక్షల రూపాయలు వస్తాయని ఆశపడి ఎలాంటి నిబంధనలు లేకున్నా సరే ఈ తరహాలో ప్లాన్ చేస్తున్నారు. ఒక్కో కిడ్నీ ఆపరేషన్‌కు దళారులు 60 లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారు. వీటిలో కిడ్నీ డొనేట్ చేస్తున్న వ్యక్తికి కేవలం 5 లక్షల రూపాయలు మాత్రమే ఇస్తున్నారు. కిడ్నీ ఆపరేషన్ చేసిన వైద్యుడికి ఒక్కో డాక్టర్‌కు 10 లక్షల రూపాయల చొప్పున ఇస్తున్నారు. మధ్యవర్తులు, ఏజెంట్లకి ఒక్కో ఆపరేషన్‌కు 30 వేల రూపాయలు ఇస్తున్నారు. ఇప్పటికే ఈ కేసులో 9 మందిని రాచకొండ పోలీసులు అరెస్టు చేశారు. మొత్తం 15 మంది నిందితులను పోలీసులు గుర్తించారు. వీరిలో మరో ఆరుగురు ప్రస్తుతం పరారీలో ఉన్నారు. మెయిన్ సర్జరీ చేసిన ఇతర డాక్టర్ల కోసం రాచకొండ పోలీసులు గాలిస్తున్నారు. వీరిని పట్టుకునేందుకు చెన్నైతోపాటు జమ్ము కాశ్మీర్ కు ఎస్ఓటి బృందాలు వెళ్లినట్టు సమాచారం.

# మహారాష్ట్రలో గిలైన్ బారి సిండ్రోమ్ కలకలం

ముంబయి, మహారాష్ట్రలో గిలైన్ బారె సిండ్రోమ్ కలకలం సృష్టిస్తోంది. తాజాగా సోలాపూర్ జిల్లాకు చెందిన ఓ వ్యక్తి మరణించగా.. అందుకు జీబీఎస్ కారణమని అనుమానిస్తున్నట్లు వైద్య వర్గాలు వెల్లడించాయి. కలుషిత ఆహారం, నీటి ద్వారా ఆ బ్యాక్టీరియా సోకుతుంది. దాని బారిన పడిన వ్యక్తుల్లో డయేరియా, పొత్తికడుపు నొప్పి, జ్వరం, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఆ ఇన్ఫెక్షన్‌కు రోగనిరోధక వ్యవస్థ ప్రతిస్పందించే క్రమంలోనే జరిగే పొరపాటే కొందరిలో జీబీఎస్‌కు దారితీస్తుంది. ప్రతీ వెయ్యి మందిలో ఒకరికే ఈ పరిస్థితి ఎదురవుతుంది.పుణెలో ఇప్పటివరకు నమోదైన జీబీఎస్ కేసుల సంఖ్య 101కి చేరుకుంది. వారిలో 16 మంది వెంటిలేటర్ మీద చికిత్స పొందుతున్నారు. మృతిచెందిన వ్యక్తి కూడా పుణెలోనే చికిత్స పొందాడు. బ్యాక్టీరియా, వైరల్ ఇన్ఫెక్షన్ కారణంగా బలహీన రోగనిరోధక శక్తి కలిగిఉన్న వ్యక్తులు ఈ జీబీఎస్ బారినపడే అవకాశాలు ఉంటాయని వైద్యులు వెల్లడించారు. శరీరానికి సోకిన ఇన్ఫెక్షన్‌కు ప్రతిస్పందించే రోగ నిరోధక వ్యవస్థ పొరపాటున నరాలపై దాడి చేసే అరుదైన పరిస్థితి ఇది. ఆ రుగ్మత బారినపడిన వారికి ఒళ్లంతా తిమ్మిరిగా అనిపించడం, కండరాలు బలహీనంగా మారడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. డయేరియాకు కారణమయ్యే కాంపిలోబ్యాక్టర్ జెజునీ బ్యాక్టీరియా జీబీఎస్‌కు కారణం కావొచ్చని వైద్యులు అనుమానిస్తున్నారు. ప్రజలు భయాందోళనకు గురికావొద్దని, జీబీఎస్ అంటువ్యాధి కాదని, చికిత్సతో నయం చేయొచ్చని వైద్యులు వెల్లడించారు. బాధితుల్లో 80 శాతం మంది ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయిన తర్వాత ఆరు నెలల్లో స్వతహాగా నడవగలరు. మరికొంతమందికి మాత్రం ఆ సమయం ఏడాది లేక అంతకంటే ఎక్కువ కూడా కావొచ్చు. ఈ చికిత్స ఖర్చుతో కూడుకున్నది. ఇమ్యునోగ్లోబిన్ ఇంజెక్షన్లు ఒక్కొక్కటి వేలల్లో ఉంటాయి. దీనిని దృష్టిలోపెట్టుకొని మహారాష్ట్ర ప్రభుత్వం రోగులకు ఊరట కలిగించే ప్రకటన చేసింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా జీబీఎస్ చికిత్స అందిస్తామని రాష్ట్ర ఆర్థిక మంత్రి అజిత్ పవార్ వెల్లడించారు.

# అమెరికాలో ఇన్‌కమ్ ట్యాక్స్ ఎత్తివేత

వాషింగ్టన్, అమెరికా పౌరులకు ఆదాయపు పన్ను నుంచి విముక్తి కల్పించేలా సోమవారం ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదనలు చేశారు. ప్రజలు స్వేచ్ఛగా ఖర్చు చేసి ఆర్థిక వ్యవస్థలోకి నిధుల ప్రవాహాన్ని పెంచేందుకే ఈ దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రజలను ధనవంతులు చేసే వ్యవస్థ పునరుద్ధరణ దిశగా ఈ చర్య ఉపయోగపడుతుందని ట్రంప్ అభిప్రాయపడ్డారు. దుబాయ్‌లో పన్ను రహిత విధానం ఉంది. ప్రస్తుతం అమెరికా ప్రభుత్వానికి లభించే ఆదాయంలో ఇన్‌కమ్ ట్యాక్స్ నుంచి వచ్చే మొత్తం చెప్పుకోదగ్గ స్థాయిలోఉంది. ట్రంప్ నిర్ణయంతో ఆ మేరకు కోతపడితే.. దానిని భర్తీ చేసుకొనేందుకు దిగుమతి సుంకాలను వాడుకోవాలన్నది ప్రణాళికగా చెబుతున్నారు. 'అమెరికన్లను ధనవంతులు, మరింత శక్తిమంతులుగా చేసే వ్యవస్థలోకి మనం వెళుతున్నాం. ఇతర దేశాలను సుసంపన్నం చేసేందుకు మన వారిపై పన్నులు వేసే బదులు.. మనమే విదేశాలపై పన్నులు విధించి అమెరికన్లను సంపన్నులు చేయాలి. వీటిని వసూలు చేసేందుకు ఎక్స్‌టర్నల్ రెవెన్యూ సర్వీసును ప్రారంభించాను' అని రిపబ్లికన్ సభ్యుల సమావేశంలో వ్యాఖ్యానించారు. అమెరికా చరిత్రలోనే 1870 నుంచి 1913 మధ్య ప్రజలు అత్యధిక సంపదతో తులతూగారని ట్రంప్ పేర్కొన్నారు. నాడు సుంకాల ఆధారిత ఆర్థిక వ్యవస్థ ఉండేదని చెప్పారు. అప్పట్లో దిగుమతి సుంకాల నుంచి ప్రభుత్వానికి పెద్దమొత్తంలో ఆదాయం లభించేదన్నారు. అమెరికా తక్షణమే తన వాణిజ్య వ్యవస్థను మార్చుకోవాలన్నారు. అమెరికా ఉద్యోగులు, కుటుంబాలను రక్షించేలా చర్యలు తీసుకోవాలన్నారు. భారత్, చైనా, బ్రెజిల్‌పై అత్యధిక పన్నులు విధిస్తామని ట్రంప్ ప్రకటించారు. 'బయట దేశాలు ఏం చేస్తున్నాయో చూడండి. చైనా భారీగా పన్నులు వసూలు చేస్తుంది. ఇక భారత్, బ్రెజిల్, ఇతర దేశాలు కూడా ఆ పద్ధతినే అనుసరిస్తున్నాయి. మనం అలా జరగనీయకూడదు. అమెరికా ప్రయోజనాలు అన్నింటికంటే ముందుండాలి' అని పేర్కొన్నారు. వాస్తవానికి ట్రంప్ గత డిసెంబర్‌లోనే బ్రిక్స్ దేశాలు ప్రత్యేక కరెన్సీ తీసుకొస్తే 100శాతం సుంకం విధిస్తామని హెచ్చరించారు. డాలర్ వినియోగం నిలిపేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

## బండిసంజయ్ దిష్టిబొమ్మ దహనం

రాజన్న సిరిసిల్ల, ప్రజా గాయకుడు గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. తాజాగా రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం మండపల్లిలో మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంజయ్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. తన ఆట, పాటలతో ప్రపంచ ప్రఖ్యాతి పొందిన గద్దర్‌పై సంజయ్ నోరు పారేసుకోవడం సరైంది కాదన్నారు. బండి సంజయ్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కాగా, 'నమ్మిన సిద్ధాంతం కోసం ప్రజాస్వామ్యబద్ధంగా బీజేపీ కార్యకర్తలు ఆందోళన చేస్తే.. నక్సలైట్లతో కలిసి ఎంతో మందిని గద్దర్ హత్య చేయించారు. అలాంటి వ్యక్తికి పద్మ అవార్డు ఎందుకు ఇవ్వాలి' అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే.

## జీహెచ్ఎంసీ కొత్త ప్లాన్, ఏంటది

హైదరాబాద్,హైదరాబాద్‌లో సాయంత్రం అయితే చాలు గంట లేదా రెండు గంటలపాటు దోమలు వీరవిహారం చేస్తున్నాయి. వాటికి బయటపడి ఆ సమయంలో చాలా మంది ఇళ్లలో తలుపు తీసిన సందర్భాలు లేవు. జీహెచ్ఎంసీ పరిధిలో చాలా ప్రాంతాలకు దోమల సమస్య వెంటాడుతోంది. వాటిని కంట్రోల్ చేసేందుకు మాస్టర్ ప్లాన్ చేస్తోంది బల్దియా.దోమల నివారణకు ప్రతీ ఏటా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోంది జీహెచ్ఎంసీ. అయినా కంట్రోల్ కావడం లేదు. కాకపోతే నిధులు మాత్రం భారీ ఎత్తున ఖర్చు చేస్తున్నారు. అయినా ఫలితం దక్కలేదు. సీజన్ మారగానే షరామామూలే. దీనిపై బల్దియా ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇంతకీ జీహెచ్ఎంసీ కొత్త ప్లాన్ ఏంటి? కొంతలో కొంతైనా ఉపశమనం కలుగులుతుందా?ప్రతీ రోజు సాయంత్రం ఐదున్నర నుంచి ఏడున్నర వరకు దోమలు వీర విహారం చేస్తున్నాయి. గతంలో వీటి నివారణకు హాట్ ఫాగింగ్ ఉపయోగించేవారు. ఇప్పుడు కోల్డ్ ఫాగింగ్‌ని వినియోగించాలని ఆలోచన చేస్తోంది. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా పరీక్షలు చేశారు. అవి మంచి ఫలితాలు సాధించాయి. రేపు మాపో జీహెచ్ఎంసీ పరిధిలో వాటిని విస్తరించాలని భావిస్తోంది.దోమల నివారణకు గతంలో హాట్ ఫాగింగ్ విధానాన్ని చేపట్టింది జీహెచ్ఎంసీ. దాని స్థానంలో కోల్డ్ ఫాగింగ్ విధానాన్ని తీసుకురానుంది. దోమల నివారణకు అమ్రపాలి కమిషనర్‌గా ఉన్నప్పుడు కోల్డ్ పద్దతిని తీసుకొచ్చారు. సౌతిండియాలో తొలిసారి ఈ విధానాన్ని గతేడాది అక్టోబర్‌లో ప్రవేశపెట్టారు. చాలా ప్రాంతాల్లో సక్సెస్ అయ్యింది కూడా. ఈలోగా ఆమె ఏపీకి ట్రాన్స్‌ఫర్ అయ్యారు.ప్రస్తుత కమిషనర్ ఇలంబర్తి ఈ విధానాన్ని తీసుకురావాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి రేపో మాపో శాస్త్రవేత్తలతో భేటీ నిర్వహించాలని ఆలోచన చేస్తున్నారు. ఆ తర్వాత కొత్త టెక్నాలజీ పద్దతిని ప్రవేశపెట్టవచ్చా? లేదా అనేది తెలియనుంది.నీటి ద్వారానే ఈ విధానాన్ని అమలు చేయవచ్చు. కొంత మోతాదు నీటిలో రెండు శాతం డెల్టామెత్రిన్ దోమల మందును కలిపి, యంత్రాలతో గాల్లోకి వ్యాపింప చేయాలి. నీటి బిందువులు గాలిలో పొరలా ఏర్పడి దోమలను అంతం చేస్తాయి. వీటి వల్ల ఎలాంటి అనారోగ్యం సమస్యలు తలెత్తవు. గతంలో ప్రశాసన్ నగర్‌లో ప్రయోగం చేశారు. మంచి ఫలితాలు వచ్చినట్టు తేలింది.దోమల నివారణ కోసం హాట్ ఫాగింగ్ పద్ధతికి ప్రతీ ఏటా జీహెచ్ఎంసీ 25 కోట్ల రూపాయలను ఖర్చు చేస్తోంది. డీజిల్ ద్వారా హాట్ ఫాగింగ్ చేసేది. డీజిల్ కొనుగోలు విధానంలో అవినీతి జరిగినట్టు కమిషనర్ దృష్టికి వచ్చింది. ఈ క్రమంలో శాస్త్రవేత్తలతో మాట్లాడి కోల్డ్ విధానాన్ని తీసుకురావాలన్నది బల్దియా ప్లాన్. దీనివల్ల డెంగ్యూ, మలేరియా వ్యాధులను కొంతైనా అరికట్టు వచ్చని ఆలోచన చేస్తోంది.ఒక్క ఏలూరు జిల్లాకే రూ. 94 కోట్లు కేటాయించామని తెలిపారు. ఔఆః రోడ్లు పనులను వచ్చేనెల చివరి నాటికి పూర్తి చేస్తామని అన్నారు. నాణ్యత విషయంలో రాజీ పడకుండా పనులు చేస్తామని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు.

## కేంద్రం పైచేయి

న్యూఢిల్లీ, దేశంలో అశాంతికి కారణమని చెబుతున్న మావోయిస్టుల అంశాన్ని పరిష్కరించడం అంటే వాళ్ళను నిర్మూలించడమేనని ప్రధాని మోడీ, అమిత్ షా చాలా కాలంగా భావిస్తున్నారు. అందుకే నక్సల్స్ నిర్మూలనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. అడువులను జల్లెడ పట్టిస్తున్నారు. అర్బన్ నక్సలైట్లుగా గుర్తించిన వారిని సైతం అంతమొందిస్తున్నారు. కేసులతో వేధిస్తున్నారు. నక్సల్స్‌కు ప్రజాదరణ లేకుండా చేయడం, వారిని మట్టుపెట్టడం అన్న లక్ష్యంతో కేంద్రం ముందుకు సాగుతోంది. సమస్యఎంతటి తీవ్రమైనదైనా, దాన్ని సరిగా అర్థం చేసుకోకపోతే అది మరింత జటిలం కావచ్చు. సాయుధ దళాలు అడవుల్లోకి బాగా లోపలికి చొచ్చుకుపోగలుగుతున్నవి. ప్రభుత్వ సాయుధ బలగాలకు నక్సలైట్లకు మధ్య దూరం నానాటికీ తగ్గిపోతోంది. మావోయిస్టుల ప్రధాన స్థావరాలకు సమీపంలో బలగాలు చేరిపోతున్నాయి. అందుకు ప్రజల మద్దతు కూడా దక్కుతోంది. కారణమేమంటే ఇన్‌ఫార్మర్ల పేరుతో మావోయస్టులు అమాయక గిరిజనలను అంతమొందిస్తున్నారు. ఇది వారికి మింగుడు పడడం లేదు. ఇంతకాలం దుర్భేద్యమనుకున్న ప్రాంతాలన్నీ సైనిక బలగాలు స్వాధీనపరచుకుంటున్నాయి. అమిత్ షా అన్నట్లుగా మావోస్ట్ పార్టీ కావచ్చు..వారి ఉద్యమం కావచ్చు...'అంతిమ ఘడియల్లో' ఉన్నట్టు చెప్పుకోక తప్పదు. బీహార్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాల్లో ఆదివాసులు, పేదప్రజలు, దళితులే మావోయిస్టులకు సానుభూతిపరులుగా ఉన్నారు. చాలా సందర్భాలలో ఆయా సానుభూతిపరులు సైతం ఎన్‌కౌంటర్లలో బలవుతున్నారు. మావోయిస్టుల ఏరివేత పేరిట భద్రతా దళాల అణచివేత చర్యలపై పౌర సమాజంలో పెద్దగా ఆందోళన వ్యక్తం కావడం లేదు. నిజానికి ప్రజల సమస్యలను ఎత్తుకున్న సమయంలో పీపుల్స వార్‌కు ప్రజల అండదండలు లభించాయి. రిక్రూట్‌మెంట్ దక్కింది. వారి పోరాటలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రజలు అండగా నిలిచారు. కాలక్రమంలో వారు దూరం కావడంతో మావోయిస్టుల ఉనికి కూడా కోల్పోతూ వస్తున్నారు. అందుకే దండకారణ్యంలో రక్తపుటేరులు పారుతున్నాయి. కాల్పుల మోతలతో బస్తర్ అడవులు మార్మోగుతున్నాయి. అబూజ్ మఢ్ కేంద్రంగా రెండు దశాబ్దాలుగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న మావోయిస్టులను భద్రతా బలగాలు వరుస ఎన్‌కౌంటర్లలో చావుదెబ్బ తీస్తున్నాయి. గత ఏడాదిగా జరుగుతున్న ఎదురుకాల్పుల ఘటనల్లో ఇప్పటివరకు మూడు వందలకు పైగా మావోయిస్టులు హతమైనట్లు పోలీసుల రికార్డులు చెబుతున్నాయి. ఈ ఏడాది ఆరంభంనుంచీ గత ఇరవై రోజుల్లోనే మూడు ఎన్‌కౌంటర్లలో 44 మందికి పైగా మావోయిస్టులు అసువులు బాశారంటే పోలీసులు ఎంతలా పైచేయి సాధించారో అర్థం చేసుకోవచ్చు. దండకారణ్యాన్ని చుట్టుముట్టి కాల్పులకు పాల్పడుతున్న సాయుధ బలగాలకు వెరచి గత ఏడాది కాలంలో సుమారు 850 మంది మావోయిస్టులు లొంగిపోగా, పోలీసులు మరో 400 మందికి పైగా అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు, సిఆర్‌పిఎఫ్, కోబ్రా బలగాలు సంయుక్తంగా 'ఆపరేషన్ కగార్' పేరిట సాగిస్తున్న ముప్పేట దాడికి సాంకేతిక పరిజ్ఞానమూ తన వంతు సహకారం అందిస్తూండటంతో మావోయిస్టులు మూల్యం చెల్లించుకోక తప్పడం లేదు. కాకులు దూరని కారడవిలో 650కి పైగా బేస్ క్యాంపులు ఏర్పాటు చేసుకుని, భద్రతా బలగాలు గాలింపు జరుపుతున్నాయి.

# ప్రమాదంలో వర్సిటీ విద్య!

హైదరాబాద్,ఉమ్మడి జాబితాలో విద్య ఉన్నప్పటికీ రాష్ట్రాల అధికారాలను హరిస్తూ విశ్వవిద్యాల యాల వైస్ ఛాన్సలర్లను ఎంపిక చేసే విధానానికి సవరణలు చేస్తూ యూజీసీ 'యూనివర్సిటీలు, కాలేజీలలో టీచర్లు, అకడమిక్ సిబ్బంది నియామకం, ప్రమోషన్, ఉన్నత విద్యలో ప్రమాణాల పరిరక్షణకు కనీస అర్హతలు' పేరిట కొత్త నిబంధనల ముసాయిదాను విడుదల చేసింది. ఇది రాజ్యాంగం కల్పించిన సమాఖ్య స్ఫూర్తికి భిన్నంగా ఉందని బీజేపీయేతర రాష్ట్రాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఇప్పటివరకు రాష్ట్రాలకు ఉన్న హక్కులకు పాతర వేయడమేనని, అన్ని అధికారాలను గవర్నర్లకు అప్పగించడంతో పాటు, వైస్ చాన్సలర్‌ల నియామకం కోసం విద్యాపరమైన అర్హతలను సడలించడం పట్ల ఆ రాష్ట్రాల అధినేతలు నిరసన తెలుపుతున్నారు. అంతే కాకుండా అఖిలభారత యూనివర్సిటీ కాలేజీ టీచర్ల సంఘాల సమాఖ్య కూడా స్పందిస్తూ యూజీసీ ముసాయిదాను ఉపసంహరించుకోవాలని కోరుతోంది. రాష్ట్రాల హక్కులను, విశ్వవిద్యాలయాల విద్యా స్వయం ప్రతిపత్తిని మూల్యంగా పెట్టి తన కేంద్రీకరణ ఎజెండాను కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది.భారతదేశంలో ఉన్నత విద్యా వ్యవస్థకు ఒక కొత్త రూపు ఇవ్వాలని, దానికో కొత్త దృక్పథం ఉండాలని నూతన జాతీయ విద్యా విధానం 2020 ఎన్నుకున్న మార్గం కేంద్రీకరణ. అన్ని అధికారాలను కేంద్రీకరిస్తూ కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో విద్యారంగం నడవాలనేది జాతీయ విద్యా విధానం మౌలిక స్వభావం. కేంద్ర, రాష్ట్రాల ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యను రాష్ట్రాల అభిప్రాయాలను స్వీకరించకుండా ఏకపక్షంగా అధికారాలను తన గుప్పిట్లోకి తీసుకుంటూ కేంద్ర ప్రభుత్వం తన సంస్థల ద్వారా అధికారం అమలు చేయడానికి చేసే ప్రయత్నాలను ఈ ముసాయిదా ద్వారా మరింత ముందుకు తీసుకెళ్తుంది.

వర్సిటీల నియంత్రణ అంటే ఇదా?

ఉన్నత విద్యా వ్యవస్థ ఎదుర్కొంటున్న అనేక సమస్యలను జాతీయ విద్యా విధానం ఏకరువు పెడుతూ వీటిని అధిగమించడానికి ఉన్నత విద్యా వ్యవస్థను సంపూర్ణంగా సంస్కరించి, నాణ్యమైన ఉన్నత విద్య అందించాలని ఆకాంక్షిస్తోంది. అందుకు జాతీయ విద్యావిధానం ఎన్నుకున్న మార్గం ఏకైక నియంత్రణ వ్యవస్థ ద్వారా ఉన్నత విద్యను నియంత్రించాలని, ఉన్నత విద్యాసంస్థల పాలన అత్యున్నత యోగ్యతలు ఉన్న స్వతంత్ర బోర్డుల ద్వారా జరగాలని ఆకాంక్షిస్తుంది. ఆ మేరకు కేంద్రం చేత నియమించబడిన బోర్డ్ ఆఫ్ గవర్నర్స్‌కు విశ్వ విద్యాలయాల నిర్వహణను అప్పగించనుంది. ప్రస్తుతం విశ్వ విద్యాలయాలను ప్రజాస్వామికంగా నిర్వహిస్తున్న విద్యా కార్య నిర్వహణ కౌన్సిళ్ల స్థానాన్ని భవిష్యత్తులో రాజకీ య ప్రేరేపిత బోర్డులు ఆక్రమించనున్నాయి.

యూజీసీకి ఆ అధికారం ఉందా?

1956లో పార్లమెంట్ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ చట్టాన్ని చేసింది. విశ్వవిద్యాలయాల్లో ప్రమాణాలను నిర్ధారించడానికి, సమన్వయ పరచడానికి యూజీసీని నెలకొల్పుతున్నామని పార్లమెంట్ ప్రకటించింది. అంతేకాక విశ్వవిద్యాలయ పరీక్షల నిర్వహణ, పరిశోధనల ప్రమాణాలను నిర్ధారించడానికి, మెరుగుపరచడానికి యూజీసీ కృషి చేయాలని చట్టం స్పష్టం చేస్తోంది. ప్రస్తుతం విశ్వవిద్యాలయాల వైస్ చాన్సలర్ పదవులకు అర్హతలు సవరిస్తూ కొత్త ప్రతిపాదనలు తెచ్చే అధికారం యూజీసీ చట్ట ప్రకారం యూజీ సీకి ఉన్నదా అనేది ఇక్కడ కీలకమైన ప్రశ్న. వాస్తవానికి చట్టంలో విశ్వవిద్యాలయాల వైస్ చాన్సలర్ ఎంపిక నియామకాల్లో యూజీసీకి ఎలాంటి అధికారాలు లేవు. కనుక వైస్ చాన్సలర్ల నియామకానికి సంబంధించి యూజీసీ తెచ్చిన కొత్త ప్రతిపాదనలు చట్టరీత్యా చెల్లుబాటు కావు.

హైకోర్టు తీర్పును ధిక్కరించి మరీ..!

ప్రత్యేకంగా చేసిన శాసనాల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశ్వవిద్యాలయాలను నెలకొల్పుతాయి. కాబట్టి ఆయా విశ్వవిద్యాలయాల వైస్



చాన్సలర్ల నియామకాలకు సంబంధించిన విధి విధానాలు, అర్హతలు సదరు ప్రభుత్వాలు శాసన రూపేణా నిర్ణయించాలి తప్ప ఆ పని యూజీసీ చేపట్ట రాదు. యూజీసీ చట్టంలోని సెక్షన్ 26 కింద విశ్వవిద్యాలయాల వైస్ చాన్సలర్ల ఎంపిక, నియామకాలు యూజీసీ పరిధిలో లేవని సురేష్ పాటిల్ ఖేడ్ వర్సెస్ ద చాన్సలర్ యూనివర్సిటీస్ ఆఫ్ మహారాష్ట్ర అండ్ అదర్స్ కేసులో ముంబై హైకోర్టు నిర్ధారించింది. అంతేకాకుండా యూజీసీ చట్టం లోని 7.3.0 నిబంధన ప్రకారం రాష్ట్రాల శాసన సభల ద్వారా నెలకొల్పబడిన కాలేజీలు, విశ్వవిద్యాలయాలకు యూజీసీ సిఫార్సులు మాత్రమే చేయగలదని బొంబాయి హైకోర్టు ఇచ్చిన తీర్పును కళ్యాణి మతివనన్ కేసులో సుప్రీంకోర్టు సమర్థిస్తోంది.

కాంట్రాక్టు అధ్యాపకులకే పట్టం

అంతేకాకుండా కొత్త నిబంధనలు కాంట్రాక్టు అధ్యాపకుల నియామకాల ఖాళీల్లో 10 శాతానికి మించకూడదనే 2018 యూజీసీ నిబంధనను తొలగిస్తున్నాయి. అంటే ఇకపై ఎలాంటి పరిమితి లేకుండా కాంట్రాక్టు పద్ధతిలో అధ్యాపకులను నియమించుకోవచ్చు. కాంట్రాక్టు అధ్యాపకులు లేని విద్యా వ్యవస్థను అభివృద్ధి పరుచుకోవాలనే స్ఫూర్తికి ఇది వ్యతిరేకం. పైగా విద్యా రంగంలో చట్టబద్ధమైన వెట్టి చాకిరికి దోహదం చేస్తుంది. ఇది నూతన జాతీయ విద్యా విధానంలో ఉపాధ్యాయుల, అధ్యాపకుల నియామకాలకు సంబం ధించి కాంట్రాక్టు పద్ధతులను, పారా టీచర్ల పద్ధతిని వ్యతిరేకించని విధానాన్నే ప్రతిబింబిస్తుంది. అంటే నూతన విద్యా విధానం ప్రకారంగా కాంట్రాక్టు పద్ధతిలో అధ్యాపకులను నియమించుకునే స్వేచ్ఛ ఈ ప్రతిపాదన ద్వారా వస్తుంది. ఈ నిబంధనలు స్థూలంగా జాతీయ విద్యా విధానం 2020 నిర్దేశాలకు అనుగుణంగా, కార్పొరేట్లకు అనుకూలంగా, టీచర్లపై ఒత్తిడి పెంచేవిగా ఉన్నాయి.

ప్రైవేట్ రంగానికి తోకలుగా వర్సిటీలు..

ఈ నిబంధనల ద్వారా యూజీసీ నాన్ అకడమిక్ వ్యక్తులను కూడా వైస్ ఛాన్సలర్లుగా నియమించడాన్ని చట్టబద్ధం చేసుకోవాలనుకుంటున్నది. ఇప్పుడీ నిబంధనలు బ్యూరోక్రాట్లు, పరిశ్రమలకు సంబంధించిన వారిని కూడా వీసీలుగా నియమించేందుకు అనుమతినిస్తున్నాయి. ఇది యూనివర్సిటీల అకడమిక్ స్వభావాన్ని దెబ్బతీసి వాటిని పరిశ్రమలకు, ప్రత్యేకించి కార్పొరేట్, ప్రైవేటు రంగా నికి తోకలుగా మార్చేందుకు జరుపుతున్న దాడి ఇది. అంతేగాక దేశంలో స్థాపించబడిన ప్రయి వేటు యూనివర్సిటీలకు అకడమిక్ వ్యక్తులనే వీసీ లుగా నియమించాలనే ఆలోచన లేకుండా స్వేచ్ఛ కల్పించే చర్య. ఇది ప్రైవేటు యూనివర్సిటీల విద్యా ప్రమాణాలపై ప్రభావం చూపుతుంది. నాణ్యతపై మరింత రాజీకి దారితీస్తుంది. ఉన్నత విద్యను తన గుప్పిట్లోకి తీసుకుని కేంద్రీకృతం చేసే, వ్యాపారమయం చేసే ఇటు వంటి ఎత్తుగడలను తిప్పికొట్టాలి. రాజ్యాంగాన్ని, అది నెలకొల్పిన విలువలను రక్షించుకోవాలి. మన విద్యా వ్యవస్థ పట్ల, దేశ భవిష్యత్తు పట్ల ఆసక్తి గల వారందరూ ఈ నిబంధనలకు తమ వ్యతిరేకించాలి. ఈ నిబంధనల ఉపసంహరణ కోసం విద్యార్థులు, అధ్యాపక వర్గాలు అన్ని ప్రజాస్వామిక శక్తులు కృషి చేయాలి.

# దక్షిణ భారతదేశంలో సుప్రీం బెంచ్ అవసరమే!

న్యూఢిల్లీ,భారత దేశంలో అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు, దేశంలో మూడంచెల న్యాయ వ్యవస్థ మనకి ఉంది, అందులో జిల్లా కోర్టులు, హైకోర్టులు, సుప్రీంకోర్టు, జిల్లా స్థాయిలో న్యాయం దొరకకపోతే, రాష్ట్ర హైకోర్టుకు అప్పీల్ కు వెళ్ళవచ్చు, హైకోర్ట్ లో న్యాయం దొరకపోతే అంతిమ న్యాయ స్థానం అయిన సుప్రీం కోర్టుకు వెళ్ళాల్సి వెళ్ళవచ్చు, ఇలా మూడు రకాలుగా మన దేశంలో న్యాయ వ్యవస్థ పని చేస్తుంది, అయితే సుప్రీం కోర్టుకు వెళ్ళాల్సి వస్తె ఢిల్లీకి వెళ్ళవలసి ఉంటుంది. అయితే ఎంతో మంది దక్షిణ భారతదేశ ప్రజలు సుప్రీం వెళ్ళాలంటే చాలా వ్యయ ప్రయాసలుతో కూడుకున్న పనిగా ఉంది ఆని చెప్పాలి.

పెరుగుతున్న పెండింగ్ కేసులు

దేశ వ్యాప్తంగా జూనియర్ సివిల్ కోర్టు స్థాయి నుండి సుప్రీం కోర్టు వరకు ఏటా ఏటా పెండింగ్ కేసులు పెరిగిపోతున్నాయి, గత ఏడాదికి ఐదు కోట్లకు పైన కేసులు పెండింగ్ లోనే ఉన్నాయి, అందులో మ్భు ఏళ్లకు పైబడిన కేసులు హై కోర్టు మరియు జిల్లా స్థాయిలో లక్షన్నర పైనే ఉన్నాయి, ఇందులో భూమి, ప్రాపర్టీ సంబంధిత కేసులు 66 శాతం మేర ఎక్కువగా ఉన్నాయి,ఒక్క సుప్రీం కోర్టు లోనే 80 వెలకు పైనే పెండింగ్‌లో ఉన్నాయి, గత నాలుగేళ్లలో 14 వేలకు పైగా పెరిగాయి, ఇందులో ఎక్కువ శాతం సివిల్ నమోదు అవుతున్నాయి, దీనికి ప్రధాన కారణం గా జడ్జీల కొరత ఎక్కువగా కనిపిస్తుంది, ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ కక్షి దారులు తిరుగుతూనే ఉన్నారు.

భౌగోళికంగా సుప్రీం కోర్టు దూరం

వాస్తవానికి సుప్రీం కోర్టు లో కేసు వేయాలని ఎంతో మంది కక్షిదారులకు ఉంటుంది, కానీ సుప్రీం కోర్టు ఉన్నది మాత్రం డిల్లీలో, అయితే దక్షిణ భారతదేశ ప్రజలు ఢిల్లీకి వెళ్లి అక్కడ ఉన్న వకీల్ పట్టుకొని కేసులు వెయ్యాలంటే చాలా ఖర్చుతో కూడుకున్న వ్యవహారం అని చెప్పాలి, ఎందుకంటే ఉదాహరణ కు తమిళనాడు ప్రజలు వెళ్ళాలంటే తమిళనాడు నుండి, డిల్లీకి 2428 కిలోమీటర్లు ఉంది, అంటే దాదాపు ప్రయాణం విమానం లో వెళ్లిన ఖర్చు అధికంగా వస్తుంది, ఒకవేళ ట్రయిన్ లో వెళ్లిన మూడు నుండి నాలుగు దినాలు కనీసం పడుతుంది, వెళ్లి అక్కడ ఉన్న న్యాయవాదులను సంప్రదించి అక్కడ ఉండి, అక్కడ వాతావరణం పడకపోవడం మరియు, మళ్ళీ వాయిదలకు తిరగాలంటే పుణ్య కాలం కాస్త



పూర్తి అయిపోతుంది, కాబట్టి అదే తంతు దక్షిణ భారతదేశంలో ఉన్న రాష్ట్రాలకు తెలంగాణ, కర్ణాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్, అదేవిధంగా పడమర దిక్కున ఉన్న రాష్ట్రాలకు సైతం చాలా కష్టమైన పనే అని చెప్పుకోవచ్చు, అటు ఈశాన్య రాష్ట్రాల్లో కూడా సుప్రీం కోర్టుకు వెళ్ళాలంటే వాళ్లకు వ్యయా ప్రయాసలతో కూడుకున్న వ్యవహారం అని చెప్పవచ్చు.

దక్షిణ భారతంలో బెంచ్..

సుప్రీం కోర్టు మరొక బెంచ్ ను దక్షిణాన పెడితే దక్షిణ భారతదేశ ప్రజలుకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది అని చెప్పొచ్చు, అందులో హైదరాబాద్ కేంద్రంగా పెడితే దక్షిణాన ఉన్న కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కేరళ, రాష్ట్రాల్లో ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది, అదేవిధంగా స్థానికంగా ఉంటారు కాబట్టి స్థానిక చట్టాలకు అవలలోకం చేసుకొని వెను వెంటనే తీర్పులు చెప్పే అవకాశం మెండుగా ఉంటాయి, గతంలో 2009లో 229వ 'లా కమిషను రిపోర్ట్' కూడా రీజినల్ సుప్రీం కోర్టు బెంచ్ లు పెట్టొచ్చు అని ప్రతిపాదనలు చేసింది, అందులో హైదరాబాద్, కొలకత్తా, ముంబాయి, చెన్నై, లాంటి ప్రాంతాల్లో, రాజ్యంగేతర వంటి కేసులు వినడానికి పెట్టొచ్చు అని ప్రతిపాదనలు చేసింది, కాబట్టి సౌత్ లో బెంచ్ పెడితే సుప్రీం కోర్టులో ఉన్న కేసులు అన్నీ ఆయా బెంచ్ లకు వెళ్లి తీర్పులు వెంటనే రావటానికి ఆస్కారం ఉంటుంది, అదేవిధంగా స్థానికంగా ఎంతో మంది సుప్రీం కోర్టు వెళ్ళడానికి వీలు కలుగుతుంది, కాబట్టి దక్షిణ భారతదేశంలో మరో బెంచ్ పెట్టాలని కోరుకుందాం.

## బీసీ రిజర్వేషన్ 42శాతం పెంచిన తరువాత స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

హైదరాబాద్,స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్ 42 శాతం పెంచిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని, లేకపోతే రాష్ట్రం రణరంగంగా మారుతుందని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. బీసీ వ్యతిరేక చర్యలను ఇప్పటికైనా మానుకోవాలని స్పష్టం చేశారు. రిజర్వేషన్ల పెంపుపై సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టమైన ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం కాచిగూడ అభినందన గ్రాండ్ హోటల్‌లో బీసీ సంక్షేమ సంఘం మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన శ్రీరామ్ జ్ఞానేశ్వర్‌కు ఆయన నియామక పత్రం అందజేసి మాట్లాడారు. కుల గణన పూర్తయినప్పటికీ రిజర్వేషన్లు పెంచడానికి ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లు పెంచుతూ అసెంబ్లీలో ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ లలో బీసీలకు 20 శాతం మాత్రమే రిజర్వేషన్లు ఉన్నాయని, వాటిని 42 శాతం పెంచితేనే బీసీలు రాజ

## బీజేపీ భావజాలం ఉంటేనే అవార్డ్ ఇస్తారా?'

హైదరాబాద్: తెలంగాణలో మరోసారి రాజకీయం వేడెక్కింది. కాంగ్రెస్, బీజేపీ నేతల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలకు కాంగ్రెస్ నేతలు కౌంటరిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న పథకాలకు ఇందిరమ్మ పేరు పెడితే తప్పేంటని ప్రశ్నించారు. అలాగే, నక్సలైట్లకు ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వొచ్చు కానీ.. పద్మ అవార్డులు ఇవ్వడానికి పనికి రారా? అని ప్రశ్నలు సంధించారు.కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కౌంటర్ ఇచ్చారు. తాజాగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..'బండి సంజయ్ వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయి. పథకాలకు ఇందిరమ్మ పేరు పెడితే తప్పేంటి?. తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన వ్యక్తిని పద్మా అవార్డులకు ప్రతిపాదిస్తే తప్పా. నక్సలైట్ భావజాలం అయితే అవార్డులు ఇవ్వరా?. మావోయిస్టులకు ఎంపీ, ఎమ్మెల్యే టిక్కెట్‌లు ఇవ్వొచ్చు కానీ, పద్మా అవార్డులకు పనికి రారా?.లెఫ్ట్ భావజాలం ఉన్న ఈటల రాజేందర్ బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవికోసం ప్రయత్నం చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది. అంటే ఈటల కూడా బీజేపీ అధ్యక్ష పదవికి అనర్హుడా?. ఈ విషయం బండి సంజయ్ చెప్పాలి. బండి సంజయ్ వ్యాఖ్యలు గద్దర్‌ను అవమానిస్తున్నట్లు ఉన్నాయి. గతంలో ప్రగతి భవన్ ముందు గద్దర్‌ను నిలబెట్టి కేసీఆర్ అవమానిస్తే.. ఇప్పుడు పద్మా అవార్డుల విషయంలో బండి సంజయ్ అవమానిస్తున్నారు అంటూ ఘాటు విమర్శలు చేశారు.ఇదే సమయంలో బండి సంజయ్‌కు ఎంపీ చామల కిరణ్ కూడా కౌంటర్ ఇచ్చారు. తాజాగా ఎంపీ కిరణ్ మీడియాతో మాట్లాడుతూ..'గద్దర్ భావజాలానికి సంబంధించి బండి సంజయ్ మాట్లాడటం హాస్యాస్పదం. బీజేపీ భావజాలం ఉన్నవారికి మాత్రమే అవార్డ్ ఇస్తారా?. గద్దర్ అణగారిన వర్గాల కోసం పోరాటం చేసిన వ్యక్తి. బీజేపీ పాట పాడిన వారు.. బీజేపీ గొంతు పలికిన వారికి ఇకపై అన్నీ అన్నట్టు బండి సంజయ్ మాటలు ఉన్నాయి. గద్దర్‌పై బండి సంజయ్ మాట్లాడిన మాటలను విత్ డ్రా చేసుకోవాలి అని కామెంట్స్ చేశారు. మరోవైపు.. బండి సంజయ్ వ్యాఖ్యలకు నిరసనగా గాంధీ భవన్ దగ్గర ఆయన దిష్టి బొమ్మను కాంగ్రెస్ శ్రేణులు దగ్ధం చేశాయి. ఈ సందర్భంగా గద్దర్‌పై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలకు పలువురు కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. ఈ క్రమంలో గద్దర్ అభిమానులకు బండి సంజయ్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## అమీన్‌పూర్‌లో రంగంలోకి బుల్డోజర్లు

సంగారెడ్డి జిల్లా,హైడ్రా మరోసారి పంజా విసిరింది. అమీన్ పూర్‌లో హైడ్రా బుల్డోజర్లు రంగంలోకి దిగి అక్రమ నిర్మాణాలను కూల్చివేశాయి. ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కోసం ఏర్పాటైన హైడ్రా అక్రమ నిర్మాణాలపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు అందిన వెంటనే హైడ్రా స్పందిస్తూ... వాటిని కూల్చివేసే పనిలో పడుతోంది. ఆక్రమణదారుల వెన్నులో వణుకుపుట్టేలా చేస్తోంది హైడ్రా. తాజాగా అమీన్ పూర్‌లో మరోసారి కూల్చివేతలు చేపట్టింది హైడ్రా. అమీన్ పూర్ పద్మావతి లేఅవుట్‌లో అక్రమంగా వేసిన ఫెన్సింగ్‌ను మంగళవారం ఉదయం హైడ్రా అధికారులు తొలగించేశారు. సంగారెడ్డి జిల్లా అమీన్ పూర్ పెద్ద చెరువు సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను హైడ్రా కూల్చివేసింది. వైసీపీ మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డికి చెందిన ప్రహరీ గోడను గతంలో అధికారులు కూల్చివేశారు. అయితే తిరిగి మరోసారి అక్కడ ఫెన్సింగ్‌ను నిర్మించారు. దీనిపై ఐలాపూర్ రాజగోపాల్ నగర్, బందంకొమ్ము ప్రాంతాల్లో స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు మరోసారి ఫెన్సింగ్‌ను కూల్చివేశారు. అమీన్ పూర్ చెరువు కబ్జా చేసి నిర్మించిన నిర్మాణాలను హైడ్రా కూల్చివేసింది. అక్రమాలపై వచ్చిన పలు ఫిర్యాదుల ఆధారంగా హైడ్రా అధికారులు విచారణ చేపట్టారు. ఆక్రమణ జరిగినట్లు తేలడంతో కూల్చివేతకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశించారు. దీంతో వెంటనే హైడ్రా బుల్డోజర్లు అక్కడకు చేరకుని కూల్చివేతలు జరిపాయి. అమీన్ పూర్ పెద్ద చెరువుకు అనుకుని ఉన్న పద్మావతి నగర్ లేఅవుట్ ఆక్రమణకు గురైంది. 193, 194, 323 సర్వే నెంబర్లో 24 ఎకరాల్లో పద్మావతి లే అవుట్ విస్తరించి ఉంది. రాజకీయ పలుకుబడితో లే అవుట్‌ను కబ్జా చేసి చుట్టూ ప్రహరీ నిర్మించారు కబ్జా దారులు. ఏపీకి చెందిన ఓ మాజీ ఎమ్మెల్యే, అతని అనుచరులు కబ్జాకు పాల్పడ్డారని బాధితులు ఆరోపిస్తున్నారు. సుమారుగా 2006 నుంచి ఈ అంశంపై బాధితులు పోరాడుతున్నారు. ఏళ్లుగా స్థానికంగా ఎవరు పట్టించుకోలేదని వారు ఆరోపిస్తున్నారు. మొత్తం 294 ప్లాట్స్‌తో పద్మావతి నగర్ లే అవుట్ ఏర్పాటు చేశారు. గత నాలుగు నెలల క్రితం మొదటగా హైడ్రాను బాధితులు ఆశ్రయించారు. సర్వే చేసి మూడు నెలల క్రితం చుట్టూ నిర్మించిన గోడను హైడ్రా కూల్చివేసింది. అయితే హైడ్రా కూల్చివేతల తరువాత కొద్ది రోజులకే ఐరన్ ఫెన్సింగ్‌కు కబ్జా దారులు వేశారు. దీనిపై మరోసారి హైడ్రా ప్రజావాణిలో బాధితులు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదుతో హైడ్రా మరోసారి కూల్చివేతలు చేపట్టింది. గతంలో కూడా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో పెద్దఎత్తున అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చివేసిన విషయం తెలిసిందే. అమీన్‌పూర్‌లో అక్రమ నిర్మాణాలపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో వెంటనే రంగంలోకి దిగిన హైడ్రా.. వాటిని కూల్చివేసింది. వందనపురి కాలనీ సర్వేనెంబర్ 848లో రోడ్డున ఆక్రమించి నిర్మించిన ఇళ్లను హైడ్రా కూల్చివేసింది. ఇళ్ల నిర్మాణంపై ఫిర్యాదులు అందడంతో వెంటనే స్పందించిన హైడ్రా... అక్కడకు చేరుకుని ఇంటిని ప్రొక్లైనర్ల సహాయంతో నేటమట్టం చేసింది. భారీ బందోబస్తు నడుమ హైడ్రా కూల్చివేతలు చేసింది. హైడ్రా కూల్చివేతలపై వందనపురి కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. చాలా కాలంగా అక్రమ ఇళ్ల నిర్మాణంపై పోరాటం చేస్తున్నట్లు వారు తెలిపారు. ఎన్నో సార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ అధకారులు ఎవరూ పట్టించుకోలేదని.. చివరకు హైడ్రాకు ఫిర్యాదు చేసిన రోజుల వ్యవధిల్లోనే అక్రమంగా నిర్మించిన ఇళ్లను కూల్చివేసిందని కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

## వాతావరణంలో మార్పులు

సంగారెడ్డి జిల్లా,హైదరాబాద్‌లో సగటు ఉష్ణోగ్రతలు 18 డిగ్రీల సెల్సియస్ పరిధిలో ఉంటాయి. అయితే, ఇటీవల జనవరి మధ్యకాలం నుంచి వీటిలో గణనీయమైన హెచ్చుతగ్గులు చోటుచేసుకున్నాయి. ఉదాహరణకు, జనవరిలో ఉష్ణోగ్రతలు 12 డిగ్రీల సెల్సియస్ వరకు పడిపోయాయి. ఏప్రిల్ నాటికి ఉష్ణోగ్రత 36-34 డిగ్రీల మధ్యకు చేరుకుంటుందని భారత వాతావరణ శాఖ తెలిపింది. గడిచిన 5 సంవత్సరాలతో పోలిస్తే ఫిబ్రవరిలో వచ్చిన వాతావరణ మార్పులు చాలా క్లిష్టంగా ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. జనవరిలోనే హైదరాబాద్ చల్లగా ఉంటుంది. ప్రతి ఏడాది జనవరిలో సగటున ఉష్ణోగ్రతలు 15.6 నుండి 28.5 వరకు నమోదు అవుతాయి. 2022లో జనవరిలో 12లో సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదయింది. 2020 లో 11 డిగ్రీల ఉష్ణోగ్రతలు కూడా నమోదయ్యాయి. ఒక 2015 జనవరిలో మాత్రం 34 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ సంవత్సరం వాతావరణ మార్పులు ప్రకృతిపై తీవ్రమైన ప్రభావం చూపుతాయని తెలుస్తోంది.

# బాబు ప్రజెంటేషన్ పై విపక్షాల మండిపాటు!



అమరావతి,ఏపీలో తాజాగా చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై తీవ్ర చర్చ జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా... ప్రజలు అర్థం చేసుకోవాలి.. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గత ప్రభుత్వం ఛిన్నాభిన్నం చేసింది.. హామీల అమలుకు ఆలస్యం అవుతుందన్నట్లుగా చంద్రబాబు స్పందించారు! దీంతో.. విపక్షాలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నాయి. ఈ సమయంలో వైఎస్ షర్మిళ స్పందించారు.అవును... ఏపీలో సూపర్ సిక్స్ హామీలు అమలుచేయడం లేదు అంటూ కొన్ని సార్లు మీడియా ముఖంగా, పలుమార్లు సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించిన ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల.. తాజాగా "సూపర్ సిక్స్ %-% సూపర్ ఫ్లాప్" అంటు ఎక్స్ వేదికగా ఓ సుదీర్ఘమైన పోస్ట్ పెట్టారు. ఈ సందర్భంగా... కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలకు ఇక శుభం కార్డు పడ్డట్లే అని తెలిపారు.దీనికి నిన్న చంద్రబాబు ఇచ్చిన ప్రజెంటేషనే నిర్దర్శనమని.. నీతి ఆయోగ్ రిపోర్ట్ ముందుపెట్టి, డబ్బులుంటేనే పథకాలంటూ నీతి సూక్తులు చెప్పారని.. పథకాలు కావాలంటే ఆదాయం పెంచాలనే మాటలు మోకాలికీ బోడి గుండుకూ ముడిపెట్టినట్లుగా ఉందంటూ షర్మిల ఫైర్ అయారు. నమ్మి అధికారం ఇస్తే రాష్ట్ర ప్రజలను ఘోరంగా మోసం చేశారని మండిపడ్డారు.ఈ క్రమంలో... 50 లక్షల మంది అన్నదాతనలను వంచించారు.. 80 లక్షల మంది విద్యార్థులకు ద్రోహం చేశారు.. 1.50 కోట్ల మంది మహిళలను మోసం చేశారు.. 50 లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకున్నారు అని షర్మిల విమర్శించారు. ఈ సమయంలో 'హామీలు ఇచ్చేటప్పుడు ఈ విషయాలన్నీ తెలియదా..?' అని షర్మిల ప్రశ్నించారు.ఇందులో భాగంగా... పథకాలకు ఆర్థిక వెసులుబాటు లేదని.. అందుకు వైసీపీ ప్రభుత్వ ఆర్థిక విధ్వంసమే కారణమని చెబుతున్న బాబుకు.. "సూపర్ సిక్స్" పథకాల రూపకల్పనలో ఈ ఘోరం, రాష్ట్ర ఆర్థిక భారం కనబడలేదా..? రాష్ట్రం రూ. 14 లక్షల కోట్ల అప్పుల్లో ఉందని చెప్పింది మీరేకదా..? అని నిలదీశారు!ఇదే సమయంలో... టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని గెలిపిస్తే 100 రోజుల్లో పాలన గాడిన పెడతామన్న మీరే.. తీరా ఓట్లు పడిన తర్వాత ఇచ్చిన హామీలపై పడతపేచీ పెట్టడం ఎంతవరకూ సమంజసం..? అని షర్మిల ప్రశ్నించడం గమనార్హం.

ఈ నేపథ్యంలో... సాకులు వెతకడం మాని పథకాల అమలుపై దృష్టి పెట్టాలని.. కేంద్రంలో పెద్దన్న పాత్ర పోషించే మీరు రాష్ట్రంలోని పరిస్థితిని మోడీకి చెప్పాలని.. పథకాలకు నిధులు అడగాలని.. గత ఐదేళ్లలో ఆర్థిక అరాచకం జరిగితే దర్యాప్తు జరిపించాలని.. పథకాలకు డబ్బులు ఇవ్వకపోతే బీజేపీకి ఇచ్చిన మద్దతు ఉపసంహరించుకోవాలని అని షర్మిల డిమాండ్ చేశారు!

ఇప్పుడు ఏ గుడి మెట్లు కడుగుతావు పవన్..?

సూపర్ సిక్స్ పథకాలపై సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై వైసీపీ మండిపడుతోంది. ఇందులో భాగంగా.. చంద్రబాబు మరోసారి వెన్నుపోటు పొడిచారని.. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేనని మోసం చేశారని మండిపడ్డారు భూమన కరుణాకర్ రెడ్డి. ఇదే సమయంలో.. ఎన్నికల ప్రచార సమయంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎంటో పవన్, చంద్రబాబుకు తెలియదా అని నిలదీశారు.ఎన్నికల సమయంలో ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినా.. వైఎస్ జగన్ కంటే ఎక్కువగా ఇస్తామని హామీ ఇచ్చారని.. ఇప్పుడేమో ఏరు దాటాక బోడి మల్లన్న చందంగా చంద్రబాబు తీరు ఉందని భూమన దుయ్యబట్టారు. ప్రస్తుతం చంద్రబాబుపై రాష్ట్ర ప్రజలు తీవ్రమైన ఆగ్రహంతో ఉన్నారని.. ప్రజలకు చంద్రబాబు తీరని ద్రోహం చేస్తున్నారని భూమన కరుణాకర్ రెడ్డి మండిపడ్డారు.ఈ నేపథ్యంలోనే పవన్ కల్యాణ్ ప్రస్తావన తెచ్చిన భూమన... చంద్రబాబు అబద్ధలా మాటలపై డిప్యూటీ సీఎం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో.. అబద్ధాలు చెప్పినందుకు ఇప్పుడు పవన్ కల్యాణ్ ఏ గుడిమెట్లు కడుగుతారో చెప్పాలని ఎద్దేవా చేశారు!

# ఆర్మీ చీఫ్‌కి వ్యతిరేకంగా పాక్ అనుకూల వర్గం కుట్ర..?

న్యూఢిల్లీ,నానాటికి బంగ్లాదేశ్ వ్యాప్తంగా మతోన్మాదం, ఉగ్రవాద భావాలు పెరుగుతున్నాయి. ఎప్పుడైతే షేక్ హసీనా పదవి నుంచి దిగిపోయిందో, అప్పటి నుంచి మహ్మద్ యూనస్ ప్రభుత్వం, పాకిస్తాన్‌తో చెలిమి చేస్తోంది.గతంలో ఎప్పుడూ లేని విధంగా పాకిస్తాన్ నుంచి సైనిక సాయాన్ని కోరుతోంది. ఇరు దేశాల మధ్య రాకపోకలు పెరిగాయి. పాక్ ఆర్మీ, ఐఎస్ఐ అధికారులు బంగ్లాదేశ్ వ్యాప్తంగా పర్యటిస్తున్నారు. వీరు భారత సరిహద్దు ప్రాంతాల్లో సమావేశాలు ఏర్పాటు చేసుకోవడం ఆందోళన కలిగించే అంశంగా మారింది. ఇక బంగ్లాదేశ్ ఆర్మీ అధికారులు, విద్యార్థి నాయకులు పాకిస్తాన్ పర్యటనకు వెళ్తున్నారు. అక్కడి పాక్ ఆర్మీ అధికారులతో భేటీ అవుతున్నారు.ఇవన్నీ చూస్తే బంగ్లాదేశ్‌లో రానున్న రోజుల్లో ఏదో పెద్ద సమస్య రాబోతున్నట్లు తెలుస్తోంది. బంగ్లాదేశ్ సైన్యంలో త్వరలో తిరుగుబాటు వస్తుందనే ఊహాగానాలు వెలువడుతున్నాయి. ప్రస్తుతం ఉన్న ఆర్మీ చీఫ్ వకార్ ఉజ్ జమాన్‌ని దించేందుకు కుట్ర పన్నినట్లు తెలుస్తోంది. ఇస్లామిక్ భావాలు కలిగిన, పాక్ అనుకూలుడిగా పేరున్న లెఫ్టినెంట్ జనరల్ మహమ్మద్ ఫైజుర్ రెహ్మాన్ పథకం రచిస్తున్నట్లు తెలుస్తోంది. తిరుగుబాటు కోసం అనుకూల వాతావరణాన్ని సృష్టిస్తున్నట్లు తెలుస్తోంది.వకార్ ఉజ్ జమాన్ గతంలో షేక్ హసీనా అనుకూలుడిగా ప్రసిద్ధి చెందాడు. స్వయంగా ఆమెతో చుట్టరికం కూడా ఉంది. భారత్ పట్ల అనుకూల వైఖరి ప్రదర్శిస్తున్నాడని ఆర్మీలోని ఒక వర్గం భావిస్తోంది. మరోవైపు బంగ్లా ఆర్మీలో మరో పవర్ సెంటర్‌గా లెఫ్టినెంట్ జనరల్ మహమ్మద్ షాహీనుల్ హక్, మేజర్ జనరల్ మహమ్ద్ మోయిన్ ఖాన్ పేర్లు కూడా ప్రముఖంగా వినిపిస్తున్నాయి. గత వారం బంగ్లాదేశ్ క్వార్టర్ మాస్టర్ జనరల్, ఇస్లామిక్ అనుకూల భావజాలం ఉన్న లెఫ్టినెంట్ జనరల్ మహ్మద్ ఫైజుర్ రెహ్మాన్, గత వారం ఢాకు వచ్చిన పాక్ గూఢచార సంస్థ ఐఎస్ఐ చీఫ్‌తో చర్చలు జరిపారు.ఈ ప్లాన్‌లో భాగంగా బంగ్లా సైన్యంలోని



నిఘా విభాగం నుండి మద్దతును పొందడానికి రెహమాన్ ప్రయత్నించవచ్చని తెలుస్తోంది. ప్రస్తుతం ఆర్మీ చీఫ్‌గా ఉన్న వకార్ ఉజ్ జమాన్, దేశాన్ని పూర్తిగా ఇస్లామిక్ శక్తులు స్వాధీనం చేసుకోకుండా నిరోధిస్తున్నారు. గతేడాది ఆగస్టు 05న షేక్ హసీనా సురక్షితంగా ఇండియా వచ్చేలా జమాన్ చర్యలు తీసుకున్నారు. బంగ్లాదేశ్ ఆర్మీలో మరో పవర్ సెంటర్‌గా.. కీలకమైన మీర్పూర్ కంటోన్మెంట్ నేషనల్ డిఫెన్స్ కాలేజ్ కమాండెంట్ లెఫ్టినెంట్ జనరల్ మొహమ్మద్ షాహీనుల్ హక్ ఉన్నారు. బంగ్లా ఆర్మీ 9వ డివిజన్‌కి చెందిన షేక్ హసీనా పార్టీ అవామీ లీగ్‌కి అనుకూల మేజర్ జనరల్‌గా పేరున్న ముహమ్మద్ మోయిన్ ఖాన్ ఆయనకు మద్దతు ఇస్తున్నారు.లెఫ్టినెంట్ జనరల్ హక్ 2022 విక్టరీ డే పరేడ్ కమాండర్‌గా, గతంలో ఆర్మీ ప్రధాన కార్యాలయంలో జనరల్ స్టాఫ్ చీఫ్‌గా ఉన్నారు. జూలై 1989లో ఆయన పదాతిదళంలో చేరారు. స్వోర్డ్ ఆఫ్ ఆనర్ అవార్డ్ కూడా ఈయన అందుకున్నారు. ఈయన గతంలో ఆర్మీ హెడ్‌క్వార్టర్స్, జనరల్ స్టాఫ్ బ్రాంచ్ ఆయుధాలు, పరికాలు గణాంకాల డైరెక్టరేట్ డైరెక్టర్‌గా పనిచేశారు.

# విశాఖ కేంద్రంగా సైబర్ నేరాలు !



తిరుపతి :డిజిటల్ అరెస్టుల పేరుతో అమాయక ప్రజలను దోచుకుంటున్న ముఠాను తిరుపతి పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి భారీ మొత్తంలో నగదు బంగారం ఇతర సాంకేతిక పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ హర్షవర్ధన్ రాజు మంగళవారం పాత్రికేయుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు.తిరుపతికి చెందిన వృద్ధురాలికి గుర్తు తెలియని వ్యక్తులు వాట్సాప్ వీడియో కాల్ చేసి తాము సీబీఐ అధికారులమని నమ్మించారు. మనీ లాండరింగ్ కేసులో సదరు మహిళ బ్యాంక్ అకౌంట్ వినియోగించారని చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని బెదిరించారు.

అరెస్టు చేయకుండా ఉండడానికి డబ్బు పంపించాలని. కేసుల్లో వృద్ధురాలి ప్రమేయం లేకపోతే ఆ డబ్బును తిరిగి పంపిస్తామంటూ నమ్మించారు. పలు సార్లు పలు అకౌంట్లకు సుమారు రూ. 2.5 కోట్లు జమ చేయించారు. ఆ తరువాత వారి నుంచి ఫోన్ రాకపోవడంతో మోసపోయినట్లు గ్రహించిన వృద్ధురాలు ఈ నెల 13వ తేదీ తిరుపతి పశ్చిమ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

ప్రత్యేక బృందాలు

కేసు నమోదు చేసిన పోలీసులు ప్రత్యేక బృందాలతో రంగంలోకి దిగి రాజమండ్రికి చెందిన పాలకొల్లు అరుణ్ వినయ్ కుమార్ అనే నిందితుడిని అరెస్టు చేశారు. అతను ఇచ్చిన సమాచారంతో అదనపు ఎస్పీ, సైబర్ క్రైమ్, క్రైమ్, పశ్చిమ పోలీసులతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు.విశాఖపట్నంలో మరో ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.32.5 లక్షల నగదు, 141 గ్రాముల బంగారం, 8 మొబైల్ ఫోన్లు, రెండు లాప్టాప్‌లు, ఒక సిమ్ మాడ్యులర్ ఎనిమిది రూటర్లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే నిందితుల అకౌంట్లో ఉన్న రూ. 10 లక్షల నగదును ఫ్రీజ్ చేయించారు.ఇప్పటి దాకా ఈ కేసులో ఏడుగురిని అరెస్ట్ చేసి, రూ. 57 లక్షల నగదు, రూ. 38 లక్షల విలువ చేసే బంగారం, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నామని, మరో రూ. 36 లక్షల నగదు లావాదేవీలను ఫ్రీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

కంబోడియా వెళ్లి సైబర్ నేరాలపై శిక్షణ

నిందితులు విశాఖపట్నం త్రినాధపురానికి చెందిన సింగంపల్లి గణేష్, చిన్న వాల్తేరుకు చెందిన పాలకొల్లు రవికుమార్, కంచరపాలెం సత్య నగర్‌కు చెందిన యుల్లి జగదీష్, మల్కాపురానికి చెందిన పెంకి ఆనంద్ సంతోష్ కుమార్, పెందుర్తి మండలం గొల్లవానిపాలెం ఎల్ఐసీ కాలనీకి చెందిన ఊటా అమర్ ఆనంద్, విశాఖపట్నంకు చెందిన కర్రి వాసుదేవ్‌గా పోలీసులు నిర్ధారించారు.నిందితులంతా డబ్బు సంపాదించాలనే అత్యాశతో కంబోడియా వెళ్లి సైబర్ నేరాలు ఎలా చేయాలో శిక్షణ పొందారు. అనంతరం విశాఖపట్నం వచ్చి ఒక గది అద్దెకు తీసుకొని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నారు.

రూటర్లు, ఇంటర్నెట్ కనెక్షన్, సిమ్ మాడ్యులర్, ఇతర సాంకేతిక పరికరాలతో ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. అమాయకులే లక్ష్యంగా వీడియో కాల్ చేసి తాము సీబీఐ అధికారుల అంటూ మోసం చేస్తూ ప్రజల ఖాతాలను ఖాళీ చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

ప్రజలకు సూచనలు

డిజిటల్ అరెస్టులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. దర్యాప్తు సంస్థలు డిజిటల్ అరెస్టులు చేయవన్నారు. సైబర్ నేరగాళ్ల బారినపడితే 1930 లేదా 112 లేదా 80999 99977కు సమాచారం ఇచ్చి సహాయం పొందవచ్చన్నారు.ఈ కేసులో ప్రతిభ కనబరిచిన వెస్ట్ సీఐ మురళీ మోహన్, సైబర్ క్రైమ్ సీఐ వినోద్ కుమార్, సీసీఎస్ సీఐ ప్రకాష్ కుమార్, ఎస్ఐలు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచారి, డీఎస్పీ శ్రీలత, ఎస్ఐ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

# ఢిల్లీ ఎన్నికల ప్రచారానికి చంద్రబాబుకు పిలుపు

అమరావతి,2024 సార్వత్రిక ఎన్నికలలో ఇటు ఏపీతో అటు కేంద్రంలో ఎన్డీఏ కూటమి ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత కేంద్రంలోని మోదీ సర్కార్ ఏర్పాటులో కూడా కూటమి తరపున గెలుపొందిన ఎంపీలు కీలక పాత్ర వహించారు. ఆ తర్వాత మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పాల్గొని మహాయుతి కూటమి గెలుపులో తమ వంతు పాత్ర పోషించారు. ఈ నేపథ్యంలోనే అదే ఊపుతో ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో కూడా పాల్గొనాలని సీఎం చంద్రబాబుకు బీజేపీ పెద్దల నుంచి పిలుపు వచ్చింది.ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ అభ్యర్థుల తరఫున చంద్రబాబు ప్రచారం చేయనున్నారు. దేశంలోని సీనియర్ మోస్ట్ రాజకీయ నాయకుడు చంద్రబాబు. అంతే కాకుండా అత్యంత అనుభవజ్ఞుడైన ముఖ్యమంత్రి కూడా ఆయనే. దీంతో, చంద్రబాబు సేవలను వినియోగించుకోవాలని బీజేపీ అధిష్టానం భావిస్తోంది. ఈ సారి ఆప్ ను ఎలాగైనా ఓడించాలని బీజేపీ పెద్దలు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఫిబ్రవరి 1వ హస్తినలో తెలుగు వారు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా చంద్రబాబు ప్రచారం నిర్వహిస్తారు.మరి, ఢిల్లీ ఎన్నికల ప్రచారానికి డిప్యూటీ సీఎం పవన్ కూడా వెళతారా లేదా అన్నది తేలాల్సి ఉంది. ఫిబ్రవరి 5వ తేదీన



పోలింగ్ జరగనుంది. ఫిబ్రవరి 8న ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. ఢిల్లీలో ఆప్, కాంగ్రెస్, బీజేపీల మధ్య త్రిముఖ పోరు జరగనుంది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ తో పొత్తు లేదని కేజ్రీవాల్ ప్రకటించారు.

# గుజరాత్‌లో 'కాంగో ఫీవర్' కలకలం..



న్యూఢిల్లీ, గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో 51 ఏళ్ల వ్యక్తి క్రిమియన్-కాంగో హెమరేజిక్ జ్వరం తో మరణించాడు. సాధారణంగా దీనిని "కాంగో జ్వరం"గా పిలుస్తుంటారు.గత 5 ఏళ్లలో ఈఇన్ఫెక్షన్‌కి సంబంధించి మొదటిసారిగా మరణం సంభవించినట్లు వైద్యులు మంగళవారం తెలిపారు. మోహన్ భాయ్‌గా గుర్తించబడిన బాధితుడు పశువుల పెంపకందారుడు. జనవరి 21న ఆస్పత్రిలో చేరాడు. జనవరి 27న చికిత్స సమయంలో మరణించారు. అతడి బ్లడ్ శాంపిళ్లను పూణేలోని ల్యాబ్‌కి పంపగా, ఈ వైరస్ ఉనికి బయటపడింది.రోగి మరణంతో ఆయన నివాసం ప్రాంతంలో ఆరోగ్య శాఖ నిఘా పెంచింది. మరిన్ని కేసులు రాకుండా అధికారులు కుటుంబ సభ్యుల్ని పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ వైరస్ సోకిన రోగులకు జ్వరం, కండరాల నొప్పి, తలనొప్పి, తలతిరగడం వంటి లక్షణాలు ఉంటాయి. ఇన్ఫెక్షన్ సోకిన 2-4 రోజుల తర్వాత నిద్రలేమి, నిరాశ, కడుపు నొప్పి, నోరు, గొంతు, చర్మంపై దద్దుర్లు వంటి లక్షణాలు కనిపిస్తాయి.ప్రపంచ ఆరోగ్య సంస్థ( డబ్ల్యూహెచ్ఓ) ప్రకారం.. క్రిమియన్ కాంగో హెమరేజిక్ ఫీవర్ వైరస్ తీవ్రమైన జ్వరానికి కారణమవుతుంది. దీని మరణాల రేటు 40 శాతం వరకు ఉంది. ప్రస్తుతం దీనికి టీకాలు లేవు. ఈ వైరస్ ప్రధానంగా పేలు, పెంపుడు జంతువుల నుంచి వ్యాపిస్తుంది. ఈ వైరస్ సోకిన వ్యక్తుల రక్తం, ఇతర శరీర స్రావాలు ద్వారా అతడికి దగ్గరగా ఉన్న వ్యక్తులకు కూడా సోకే అవకాశం ఉంది.

# ఆ నాలుగు పథకాలూ గట్టెక్కిస్తాయా?

హైదరాబాద్,తెలంగాణలో రేవంత్ నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటింది. ఈ ఏడాది కాలంలో రేవంత్ సర్కార్ విజయాలూ, ఫెయిల్యూర్స్ సమానంగానే ఉన్నాయని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. పార్టీలో అసమ్మతి, అసంతృప్తి ఆనవాలు కూడా కనిపించకుండా చేసుకోవడంలో రేవంత్ సక్సెస్ అయితే.. వాగ్దానాల అమలు విషయంలో ఆయన ఫెయిల్ అయ్యారని అంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన పథకాల అమలుపై దృష్టి సారించారని చెబుతున్నారు. త్వరలో పంచాయతీ ఎన్నికలు రాజనున్నాయి. ఆ ఎన్నికలలో గట్టెక్కాలంటే ఏదో విధంగా పథకాలు సక్రమంగా అమలు చేయగలుగుతున్నారన్న భావన ప్రజలలో కలగాలి. లేకపోతే ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకోక తప్పదు. పంచాయతీ ఎన్నికలలో విఫలమైతే.. రేవంత్ కు కష్టాలు తప్పవన్న అంచనాలు ఉన్నాయి. ఇప్పటి వరకూ గట్టిగా మద్దతు ఇస్తూ వచ్చిన హైకమాండ్ పంచాయతీ ఎన్నికల ఫలితాలు కొంచం అటూ ఇటూ అయితే.. అసమ్మతి, అసంతృప్తి ఉధృతిని అణిచివేసి రేవంత్ కు సపోర్ట్ గా నిలబడటంపై పెద్ద ఆసక్తి చూపే అవకాశలు పెద్దగా ఉండవు.దీంతో ఇప్పుడు రేవంత్ రెడ్డి తాజాగా అంటే రిపబ్లిక్ డే రోజుల ప్రారంభించిన పథకాల అమలుపై గంపెడాశలు పెట్టుకున్నారు. ఈ నాలుగు పథకాలను పక్కాగా అమలు చేస్తేనే ప్రభుత్వంపై సానుకూలత ఏర్పడే అవకాశం ఉంటుంది. రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల మంజూరు, ఇందిరమ్మ ఇళ్ళ కేటాయింపు కోసం ఏర్పాటు చేసిన గ్రామసభలు చాలా వరకూ రసాబాసగా మారిన సంగతి తెలిసిందే. దానిని బట్టే పథకాల అములు విషయంలో లబ్ధిదారుల్లో ఆందోళన ఏ స్థాయిలో ఉందో అర్థమౌతోంది. దీనిని గ్రహించే రేవంత్ రెడ్డి విడతల వారీగా వీటి అమలుకు నిర్ణయించారు. తొలి దశలో 563 మండలాల్లోని 563 గ్రామాల్లో ఈ పథకాల అమలుకు రేవంత్ సర్కార్ శ్రీకారం చుట్టింది. 4,41,911 మంది రైతులకు పెట్టుబడిసాయం కింద సోమవారం (జనవరి 27) రైతుభరోసా రూ 6 వేలు రైతుల ఖాతాలో జమ చేసింది. అలాగే ఇందిరమ్మ ఆత్మీయభరోసా పథకంలో భాగంగా 18,180 మంది రైతుకూలీలకు రు.6 వేలుచొప్పున రు. 10.91 కోట్లు జమచేసింది. బీఆర్ఎస్ హయాంలో వ్యవసా యకూలీలను



ప్రభుత్వం పెద్దగా పట్టించుకోలేదన్న సంగతి విదితమే. ఇక మూడోపథకంగా కొత్తగా 15,414 రేషన్ కార్డులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ కొత్తకార్డుల వల్ల 51,912 కుటుంబాలు లబ్దిజరిగింది. అలాగే కుటుంబాల్లో కొత్తసభ్యులను చేర్చాలని వచ్చిన దరఖాస్తుల్లో 1.03 లక్షల కార్డుల్లో కొత్తసభ్యుల పేర్లను మార్చింది. చివరగా గూడులేని అర్హులైన నిరుపేదలు 72 వేలమందికి ఇందిరమ్మ ఇళ్ళపథకంలో యాజమాన్య పత్రాలను అందించింది. స్థానిక సంస్థల ఎన్నికలలో విజయం లక్ష్యంగానే రేవంత్ ప్రభుత్వం ఈ నాలుగు పథకాల అమలుకు గట్టిగా నిర్ణయం తీసుకుంది. అయితే ఇప్పుడు పైలట్ ప్రాజెక్టులో పరిమితంగానే అమలు చేయడం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదు. ఎన్నికలలోపు ఈ పథకాలను రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయడందాని తర్వాతే స్థానికసంస్థల ఎన్నికలను నిర్వహించాలన్నది రేవంత్ ఆలోచనగా పార్టీవర్గాలు చెబుతున్నాయి. అందుకనే ముందుగా పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికచేసిన 563 గ్రామాల్లో పథకాల అమలుకు శ్రీకారంచుట్టింది. పైలెట్ ప్రాజెక్టు అమలుసరే పైనాలుగుపథకాలు రాష్ట్రంలో వివాదాలకు తావులేకుండా ఎప్పుడు అమలవుతుందో చూడాలి.

# ఏపీ ఐటి రాజధానిగా విశాఖ..



విశాఖపట్నం, ఏపీ ఆర్థిక రాజధానిగా ఉన్న విశాఖను తాజాగా ఐటి రాజధాని చేయాలని ఏపీ ప్రభుత్వం వడి వడిగా అడుగులు వేస్తున్నది.. రైలు, రోడ్డు, విమానయాన సౌకర్యాలు ఈ నగరంలో అందుబాటులో ఉండటంతో పాటు నౌకయానం మార్గం ఇక్కడ కేంద్రీకృతం అవడంతో ఐటీ కంపెనీలు ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తున్నది..దీనిలో భాగంగానే హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ తరహాలో విశాఖలోని మధురవాడ దగ్గర 500 ఎకరాల్లో డేటా సిటీని అభివృద్ధి చేయాలని ఏపీ సర్కార్ నిర్ణయం తీసుకుంది. హౌసింగ్ డేటా సెంటర్లు, కృత్రిమ మేధ (ఏఐ) హబ్‌ల ఏర్పాటు కంపెనీలకు అందులో చోటు కల్పించనుంది. డీప్ టెక్నాలజీ, ఏఐ, బిగ్ డేటా రంగాల్లో ప్రపంచ వ్యాప్తంగా విస్తృత అవకాశాలున్నాయని భావిస్తున్న ప్రభుత్వం వాటిని అందిపుచ్చుకోవడానికి ఈ డేటా సిటీపై ప్రత్యేక ఫోకస్ పెట్టింది.ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విశాఖపట్నంలో ఐటీ రంగం అభివృద్ధిని ప్రాధాన్యంగా తీసుకుంది. ఐటీ మంత్రి లోకేశ్ ఆలోచనలకు అనుగుణంగా డేటా సిటీ రూపు దిద్దుకోనుంది. విశాఖకు వచ్చే ఐటీ ఆధారిత కంపెనీలకు డేటా సిటీని కేంద్రంగా చేయాలన్నది సర్కార్ ఆలోచన.

ప్రముఖ ఐటీ కంపెనీల దృష్టి..

గూగుల్ సంస్థ విశాఖలో 80 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న డేటా సిటీ అభివృద్ధికి సర్కార్ సహకరిస్తుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం, యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వడానికి గూగుల్ సంస్థ సహకరించేలా అవగాహన ఒప్పందం కుదిరింది.టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) విస్తరణ ప్రాజెక్టును విశాఖలో ఏర్పాటు చేస్తోంది. మేధా టవర్స్‌లో ఖాళీ స్థలాన్ని ఈ సంస్థకు సర్కార్ తాత్కాలికంగా కేటాయించింది. 90 రోజుల్లో కార్యకలాపాలు ప్రారంభించనుంది. శాశ్వత కార్యాలయ నిర్మాణానికి 30 ఎకరాలు కేటాయించింది. నూతన క్యాంపస్ ఏర్పాటు కోసం పలు ప్రాంతాలను ఇన్ఫోసిస్ పరిశీలిస్తోంది. విస్తరణపై దృష్టి పెట్టిన విప్రోను విశాఖకు తీసుకొచ్చేలా ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతోంది.కాగ్నిజెంట్ సీఈవో రవికుమార్‌తో మంత్రి లోకేశ్ దావోస్‌లో భేటీ అయ్యారు. ఆ సంస్థ త్వరలో విశాఖకు వచ్చే అవకాశముంది.

ఐటీ కంపెనీలతో లోకేశ్ చర్చలు..

ఇటీవల దావోస్‌లో ప్రపంచ దేశాల పెట్టుబడుల సదస్సులో పలు సంస్థల సీఈవోలతో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఐటీ రంగానికి ఏపీలో ఉన్న అవకాశాలను వివరించారు. కృత్రిమ మేధ (ఏఐ), డీప్‌టెక్ రంగాల్లో నవీన ఆవిష్కరణల కోసం రాష్ట్రంలోని యూనివర్సిటీలతో కలిసి పనిచేయాలని స్విస్ పరిశోధన సంస్థలను ఆహ్వానించారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com